
# భగవంతునికి ఇష్టులవ్వాలంటే?





రచన :
బ్రహ్మర్షి
తటవర్తి వీరరాఘవరావు

# భగవంతునికి ఇష్టులవ్వాలంటే?



**రచన & ప్రచురణ : బ్రహ్మర్షి తటవర్తి వీరరాఘవరావు**

మొదటి ముద్రణ : డిశంబరు, 2025
ప్రతులు : 2,000

**వెల : రూ.50/-**

**పుస్తకముల కొరకు :-**
**తటవర్తి వీరరాఘవరావు,**
**తటవర్తివారి వీధి, భీమవరం - 534 201.**
**సెల్ : 94901 71853, 9440309812**

# తటవర్తి రాజ్యలక్ష్మి గారి రచనలు

| | | |
|---|---|---|
| 1) మరోజన్మ | - | రూ.160/- |
| 2) సాధనలో స్థితులు | - | రూ.80/- |
| 3) జ్ఞానమాల | - | రూ.70/- |
| 4) దత్తాత్రేయుని 24 మంది గురువులు | - | రూ.70/- |
| 5) బుద్ధుని సూక్తులు | - | రూ.70/- |
| 6) జీవిత పరమార్థం | - | రూ.70/- |
| 7) అవిద్య అంటే? | - | రూ.70/- |
| 8) బుద్ధుని పంచశీలాలు | - | రూ.70/- |
| 9) ఆత్మ జ్ఞానం పొందలేకపోవడానికి కారణం? | - | రూ.70/- |
| 10) మనసుకు వున్న మూడు దోషాలు | - | రూ.60/- |
| 11) గురుపౌర్ణమి విశిష్ఠత | - | రూ.60/- |
| 12) మానవుడు యోగిగా ఎదగాలంటే? | - | రూ.60/- |
| 13) ఏది సరైన సాధన? | - | రూ.60/- |
| 14) పంచకోశాలు | - | రూ.60/- |
| 15) మానవుని కర్తవ్యాలు | - | రూ.50/- |
| 16) చిత్తవృత్తులు ఎలా ఏర్పడతాయి? | - | రూ.50/- |
| 17) ప్రీతి,భీతి, నీతి | - | రూ.40/- |


పుస్తకముల కొరకు :-

**తటవర్తి వీరరాఘవరావు,**

తటవర్తివారి వీధి, భీమవరం - 534 201.

సెల్ : 94901 71853, 9440309812

# భగవంతునికి ఇష్టులు అవ్వాలంటే?

ప్రపంచంలో మనం చూసినట్లయితే 99 శాతం మంది దైవాన్ని నమ్ముతున్నారు. నమ్మకాల్లో తేడా ఉండొచ్చు, దైవం యొక్క పేర్లు తేడా ఉండొచ్చు, ఆ దైవాన్ని ఆరాధించే విధానంలో తేడా ఉండొచ్చు కానీ అంతా దైవాన్ని నమ్మేవారే. అందుచేత మీరు ఎవరినైనా మీకు దేవుడంటే ఇష్టమేనా అని అడగండి. వెంటనే అంతా ఇష్టమే అని చెప్తారు. బాగా ఇష్టమా? అని మళ్ళీ అడిగితే బాగా ఇష్టం అని కూడా చెప్తారు.

ఇష్టమని ఏ రకంగా చెప్పగలుగుతున్నావు అని ప్రశ్నిస్తే నేను భక్తితో ప్రతిరోజు పూజిస్తున్నానని కొంతమంది, ప్రార్థిస్తున్నాను అని కొంతమంది, నమాజు చేస్తున్నాను అని కొంతమంది, భజనలు చేస్తున్నాను అని మరి కొంతమంది సమాధానాలు చెప్తారు. అటువంటి వాళ్ళని మీరు ఇంకొక ప్రశ్న అడగండి. నీకు దేవుడంటే ఇష్టం అని అంటున్నావు అసలు దేవుడికి నువ్వు ఇష్టుడు అయ్యావా? అంటే చెప్పలేరు. మరి అది ఎవరు చెప్పగలరు అంటే ఆ దేవుడే చెప్పగలడు.

మళ్లీ ఇంకొక ప్రశ్న అడగండి. నీకు దేవుడు ఇష్టమైతే నువ్వు గొప్పవాడివా? లేక దేవుడికి నువ్వు ఇష్టుడు అయితే నువ్వు గొప్పవాడివా? అని. వెంటనే దేవుడికి నేనే ఇష్టుడు అవ్వాలండి అని చెప్తారు. అందుచేత ఇప్పుడు మనం ఏం చేస్తే దేవుడికి ఇష్టులమవుతాము? దేవుడికి ఇష్టులు అయితే మనం ఎలాంటి లాభాలు పొందుతాం? అసలు ఎటువంటి వాడిని ఆయన ఇష్టపడతాడు? అన్నది తెలుసుకుందాం.

ఎందుచేతనంటే మీరు దేవుడికి ఇష్టమైనట్టు జీవించగలిగితే మీరు మోక్షాన్ని పొందినట్టే, సమస్త దుఃఖాల్లో నుంచి బయట పడినట్టే. ఇప్పుడు మీరు అడగొచ్చు ఇది ఎలా తెలుస్తుందండి అని. ఎలా తెలుస్తుంది అంటే

భగవద్గీతలో సాక్షాత్తు శ్రీకృష్ణ భగవానుడే తనకు ఎవరు ఇష్టులు అన్నది స్పష్టంగా చెప్పడం జరిగింది. వాటిని మనం తెలుసుకొని, బాగా అర్థం చేసుకొని ఆ రకంగా ప్రవర్తిస్తున్నామా? లేదా? అన్నది చూసుకోవాలి. ఏమైనా లోపాలు ఉంటే సరి చేసుకుంటే అప్పుడు ఖచ్చితంగా మీ జన్మ ధన్యమైనట్టే, ఈ జనన మరణ చక్రం నుంచి బయట పడినట్టే.

అసలు ఏ గురువు దగ్గరికి వెళ్ళక్కర్లేదు, ఎవరి సలహా మనకు అక్కర్లేదు. అందుచేత శ్రీకృష్ణుల వారికి ఎవరు ఇష్టులో ఇప్పుడు తెలుసుకుందాం.

ఆయన తనకు ఇష్టులైన వారి గురించి కొన్ని శ్లోకాల్లో బోధించడం జరిగింది. ఇప్పుడు అవి తెలుసుకుందాం.

**శ్లో: చతుర్విధా భజన్తే మాం జనాస్సుకృతి నోర్జున**
**ఆర్తో జిజ్ఞాసు రర్థార్థీ జ్ఞానీ చ భరతర్షభ. (భ.గీ.7-16)**

తా: భరతవంశ శ్రేష్ఠుడవగు ఓ అర్జునా! ఆపదలలో ఆర్తనాదాలు చేసేవారు, ధనాన్ని ఆశించేవారు, భగవంతుని తెలుసుకోవాలనే ఆసక్తి కలవారు, ఆత్మ జ్ఞానము కలవారు అనే నాలుగు విధాలైన వారు నన్ను సేవిస్తున్నారు.

**శ్లో: తేషాం జ్ఞానీ నిత్యయుక్త ఏకభక్తిర్వి శిష్యతే**
**ప్రియో హి జ్ఞానినోత్యర్థమహం స చ మమ ప్రియః (భ.గీ.7-17)**

తా: వారిలో నిత్యము పరమాత్మ(ఆత్మ)తో కూడి ఉండేవాడు, పరమాత్మ(ఆత్మ) యందు భక్తి(ఆసక్తి) కలవాడగు 'జ్ఞాని' శ్రేష్ఠుడు. అట్టి జ్ఞానికి నేనూ ఇష్టుడనే, అతడు కూడా నాకు ఎక్కువ ఇష్టుడే.

ఈ శ్లోకాల ద్వారా మనం ఏం తెలుసుకోవచ్చు అంటే మొత్తం ప్రపంచంలో దైవాన్ని ఆరాధించే వారిని మనం నాలుగు రకాలుగా విభజించుకోవచ్చు. ప్రపంచంలో ఈ నాలుగు రకాల వాళ్ళ కంటే వేరే ఎవరు మీకు కనపడరు.

వారు ఎవరంటే?

**1. ఆర్తులు**

**2. అర్ధార్ధులు**

**3. జిజ్ఞాసులు**

**4. జ్ఞానులు.**

వీళ్ళ గురించి కొంచెం వివరంగా తెలుసుకుందాం.

**1. ఆర్తులు:-** కష్టాలు వచ్చినా, రోగాలు వచ్చినా, సమస్యలు వచ్చినా, ఆర్థిక ఇబ్బందులు వచ్చినా, సంసారంలో గొడవలు వచ్చినా తట్టుకోలేక, ఏం చేయాలో తెలియక, ఈ కష్టాలు ఎందుకు వవచ్చాయో అర్థం కాక, రకరకాల ప్రయత్నాలు చేసినా, రకరకాల గురువుల్ని, పెద్దల్ని ఆశ్రయించినా బయట పడలేకపోవడం వల్ల ఏం చేయాలో తెలియక ఆ దైవాన్ని ఆర్తితో ఆరాధించే వారినే ఆర్తులు అంటారు.

అంటే వీళ్ళ కోరిక ఏమిటంటే? వీళ్ళకున్న సమస్య నుంచి, కష్టం నుంచి బయట పడేయమని ఆర్తితో దీనాతి దీనంగా వేడుకుంటారు. సింపుల్ గా చెప్పాలంటే కష్టాల నుంచి నన్ను బయట పడేలా చెయ్యి అని కోరుకునేవారే ఆర్తులు.

**2. అర్ధార్థులు:-** వీళ్ళకి కష్టాలు ఉండవు, సమస్యలు ఉండవు, ఇంట్లో గొడవలు ఉండవు ఏ ఇబ్బంది ఉండదు. కానీ వీళ్ళకి ఉన్న డబ్బు చాలదు. అందుచేత ఆ దేవుణ్ణి ఇంకా డబ్బు ఇమ్మని ప్రార్థిస్తారు. వారు చేసే వ్యాపారంలో, ఉద్యోగంలో దేవుడికి పర్సెంటేజ్ ఇస్తారు.. నా వ్యాపారంలో ఇంత లాభం వస్తే నీకు 1% ఇస్తాను, 5% ఇస్తాను, 10% ఇస్తాను అని మొక్కుకుంటారు. ఇలా ధనాన్ని అర్థించే వారినే అర్ధార్థి అంటారు.

**3. జిజ్ఞాసులు:-** వీళ్ళకు కోరికలు ఉండవు. ధనము అక్కర్లేదు. వీళ్ళకి ఆ దేవుడే కావాలి. ఆయన్ని సాక్షాత్కరించుకోవాలి. ఆయన్ని దర్శించాలి అనే

తపన ఎక్కువగా ఉంటుంది, ఈ ఆసక్తి ఎక్కువగా ఉంటుంది. (జిజ్ఞాసులు అంటే ఆసక్తి కలవారు)

కానీ వీళ్ళకి ఆ దేవుడు ఎవరో తెలియదు, ఆయన ఎక్కడ ఉంటాడో తెలీదు, ఆయన్ని ఎలా ఆశ్రయించాలో తెలీదు, తన కోరిక ఎలా నెరవేర్చుకోవాలో తెలీదు. అందుచేత ఆశ్రమాలకు, పీఠాలకు, ఆరామాలకు వెళ్తూ ఆ గురువుల్ని, పెద్దలను ఆశ్రయించి ఆ దైవాన్ని పొందే మార్గం తెలుసుకోవాలని ఎంతో ఆరాటపడుతూ తిరుగుతూ ఉంటారు. ఇలాంటి వారినే జిజ్ఞాసులు అంటారు.

**4.జ్ఞానులు:–** జ్ఞానులు అంటే భగవంతుడు గురించి తెలుసుకున్నవారు. అంటే వీళ్ళకి భగవంతుడు ఎవరో తెలుసు, ఆయన ఎక్కడ ఉంటాడో తెలుసు, ఆయన్ని పొందాలంటే ఆయన్ని ఎలా ఆశ్రయించాలో కూడా తెలుసు. మరి ఆ ప్రయత్నంలో ఉన్నవారే, ఆ ప్రయత్నాన్ని దీక్షగా చేస్తున్నవారే, జ్ఞానులు.

ఈ మార్గంలో పయనిస్తూ, జ్ఞానం పొందుతూ, ఆ భగవంతుని పొందడానికి తీవ్ర కృషి చేస్తున్న మనమంతా ఈ కోవకు చెందిన వాళ్ళమే. మనం ఖచ్చితంగా సాధించి తీరతాం.

అందుచేత ప్రపంచంలో ఎంతమంది ఉన్నా ఎవరు భగవంతునికి ఇష్టులు అంటే! జ్ఞానం పొందడానికి ప్రయత్నించేవారే భగవంతునికి ఇష్టులు, వారే గొప్పవారు కూడా. ఇక్కడ మీరు ఒకటి గుర్తుపెట్టుకోవాలి, కోరికలతో ధ్యానం చేసేవాడు భగవంతునికి ఇష్టుడు కాలేడు.

కోరికలతో రకరకాల సాధనలు చేసినా, రకరకాల ఆరాధనలు చేసినా, ధ్యానులు అయినా సరే! వాళ్ళు మొదటి రెండు కేటగిరీల్లో ఉన్నటువంటి వాళ్ళే. అందుచేత ఆశించి ధ్యానం చేసేవారు భగవంతునికి ఇష్టులు కాలేరు.

**“భగవంతుని ఇష్టపడే వాళ్ళ కంటే కూడా భగవంతుడు ఇష్టపడే వాళ్ళే చాలా గొప్పవాళ్ళు, అదృష్టవంతులు”.** కష్టాలు తొలగించమని ఆర్తనాదాలు

చేసే ఆర్తులు, ఏ కష్టాలు లేకపోయినా నాకు ఇంకా డబ్బు ఇవ్వు అనే అర్థార్థులు ఎవరు అంటే? భగవంతుడి నుంచి ఇష్టపడేవాళ్ళు.

అంటే ఆయన కోరికలు తీరుస్తాడు, కష్టాల నుండి గట్టెక్కిస్తాడు, పాపాలు క్షమిస్తాడు, ధనాన్ని ఇస్తాడు అని ఆయన్నుంచి ఇష్టపడేవాళ్ళు. అంటే కోరికలు కోరే వాళ్ళంతా కూడా ఈ కోవ కిందకే వస్తారు. ఇలాంటి వాళ్ళు లోకంలో 90% ఉండచ్చు.

ఇక మూడవ రకం వారు జిజ్ఞాసులు. వీళ్ళకి ధనం అక్కర్లేదు, కోరికలు ఉండవు, వీళ్ళకి భగవంతుడే కావాలి, భగవంతుడ్ని చేరుకోవాలి, ఆయన సాక్షాత్కారం పొందాలి అన్నదే వాళ్ళ ఆశయం.. వీళ్ళకి భగవంతుడంటే ఇష్టం అంటే ఈ మూడవ రకం వాళ్ళు "భగవంతుడ్ని ఇష్టపడేవాళ్ళు".

నాలుగవ రకం ఎవరంటే "భగవంతుడు ఇష్టపడేవాళ్ళు". ఇలా నాలుగు రకాల భక్తుల్ని మూడుగా మనం విభజించుకోవచ్చు.

1) భగవంతుడి నుంచి ఇష్టపడేవాళ్ళు.

2) భగవంతుడ్ని ఇష్టపడేవాళ్ళు

3) భగవంతుడు ఇష్టపడేవాళ్ళు

ఇప్పుడు మీరు ఏ రకమైన భక్తులో! ఏ కేటగిరీ క్రిందకి వస్తారో! మీరు చూసుకోవచ్చు. ఇది బాగా అర్థం అవ్వడానికి పురాణాల్లో ఒక కథ తెలుసుకుందాం.

నారదుడు నారాయణ నారాయణ అంటూ త్రిలోక సంచారం చేస్తూ ఉంటాడు. అలా తిరుగుతూ ఒకరోజు అనుకోకుండా వైకుంఠానికి వెళ్ళాడు.

అక్కడ విష్ణుమూర్తి ఒక పుస్తకం చూస్తున్నాడు. ఎప్పుడూ లేనిది విష్ణుమూర్తి పుస్తకం చూస్తుంటే నారదుడికి ఆశ్చర్యం వేసింది. ఏంటా పుస్తకం! అని సందేహిస్తూ విష్ణుమూర్తి దగ్గరికి వెళ్ళి స్వామి ఏమిటి ఈ పుస్తకం అని అడిగాడు.

అప్పుడు విష్ణుమూర్తి ఇది నన్ను ఇష్టపడే వాళ్ళ లిష్టయ్యా అన్నాడు. అప్పుడు నారదుడికి ఆ లిస్టు లో తన పేరు ఉందా? లేదా? అని సందేహం వచ్చింది. స్వామి అందులో నా పేరు ఉందా అని అడిగాడు. అప్పుడు విష్ణుమూర్తి ఈ పుస్తకంలో మొదటి పేరు నీదేనయ్య అన్నాడు. అప్పుడు నారదుడు ఎంతో పొంగిపోయాడు. నారదుడికి మళ్లీ ఇంకొక సందేహం వచ్చింది. మరి ఆంజనేయ స్వామిది ఎన్నో పేరు అని మెల్లిగా అడిగాడు. అప్పుడు స్వామి పేజీలన్నీ తిరగేసి ఆంజనేయ స్వామి పేరు ఇందులో లేదయ్యా అన్నాడు. నారదుడు ఇంకా పొంగిపోయాడు.

ఈ విషయాన్ని అందరికీ చెప్పాలనే ఉద్దేశ్యంతో ఇంకా అక్కడ ఉండలేక స్వామివారి దగ్గర సెలవు తీసుకున్నాడు. మళ్లీ సంచారానికి బయలుదేరాడు. అందరికీ అలా చెప్పుకుంటూ తిరుగుతూ ఉంటే ఒకచోట ఆంజనేయ స్వామి ధ్యానం చేసుకుంటూ కనిపించాడు. ఈ విషయం ఆయనకి చెప్పాలని నారదుడు ఆంజనేయ స్వామి దగ్గరికి వెళ్ళాడు.

ఆంజనేయ స్వామి కళ్ళు తెరిచి ఏమిటి స్వామి ఇలా వచ్చారు అన్నాడు. అప్పుడు నారదుడు జరిగిందంతా చెప్పాడు. స్వామి దగ్గర ఒక పుస్తకం ఉంది అందులో నా పేరు ఉంది కానీ నీ పేరు ఎక్కడా లేదు. ఎందుకో నాకు అర్థం కాలేదు అన్నాడు. అప్పుడు ఆంజనేయ స్వామి పోనిలే మీరు క్షేమము, స్వామీ క్షేమమే కదా! నాకు ఇంకేం కావాలి అని మళ్ళీ కళ్ళు మూసుకొని ధ్యానంలోకి వెళ్ళిపోయాడు.

నారదుడు మళ్లీ సంచారానికి బయలుదేరి అనుకోకుండా మళ్ళీ వైకుంఠానికి వెళ్ళాడు. ఈసారి స్వామి ఇంకొక పుస్తకం తిరగేస్తున్నాడు. మళ్లీ ఆసక్తిగా దగ్గరికి వెళ్ళి స్వామి ఈ పుస్తకం ఏమిటి? అన్నాడు. అప్పుడు స్వామి ఇది “నేను ఇష్టపడే వాళ్ళ లిస్టయ్యా” అన్నాడు.

ముందు నన్ను ఇష్టపడేవాళ్ళ లిస్ట్ అన్నాడు, ఇప్పుడు నేను ఇష్టపడే వాళ్ళ లిస్ట్ అన్నాడు. అప్పుడు స్వామి ఇందులో కూడా నా పేరు ఉందా? అన్నాడు. పుస్తకం అంతా తిరిగేస్తే నారదుడి పేరు లేదు. ఆంజనేయ స్వామి పేరు ఉందా అని అడిగాడు. చూస్తే మొదటి పేరు ఆంజనేయ స్వామిదే. ఇంక అక్కడ ఉండలేకపోయాడు, స్వామి వెళ్ళొస్తా అన్నాడు.

ఈ పురాణ కథ మీరు గమనిస్తే భగవంతుడ్ని ఇష్టపడే వాళ్ళ లిస్టు, భగవంతుడు ఇష్టపడే వాళ్ళ లిస్టు ఉంది కానీ, భగవంతుడి నుంచి ఇష్టపడేవాళ్ళ లిస్టు భగవంతుని దగ్గర లేదు. అంటే కోరికలు కోరేవాడిని భగవంతుడు అసలు పట్టించుకోడు అని తెలుస్తుంది. అందుచేత ఎవరైతే కోరికలు కోరుతూ ఉంటారో, సంకల్పాలు పెడుతూ ఉంటారో, వాళ్ళపై భగవంతుడు అసలు దృష్టి పెట్టడు. అందుచేత కోరికలతో చేసే ఆరాధనలు, సాధనలు అన్నీ వ్యర్థమే. కోరికలు కోరేవాళ్ళు తృప్తి మాత్రమే పొందగలరు కానీ ముక్తిని పొందలేరు.

ఇక్కడ మూడో కేటగిరీ అయిన జిజ్ఞాసులకి భగవంతుడు ఎవరో తెలీదు, ఎక్కడ ఉంటాడో తెలీదు, ఆయన్ని ఎలా ఆశ్రయించాలో తెలీదు, అలాంటి అయోమయ స్థితిలో ఉంటారు. వీళ్ళకి భగవంతుడంటే ఇష్టమే. కానీ ఇవన్నీ తెలుసుకున్నవాడే భగవంతుడికి ఇష్టుడు అవుతాడు. ఇవన్నీ మనం తెలుసుకున్నాం. మనమంతా భగవంతునికి ఇష్టమైన వాళ్ళ లిస్టులో ఉన్నట్టే.

మరి భగవంతుడు ఎవరు అంటే? ఆత్మ. ఆత్మ ఎక్కడ ఉంటుంది అంటే? సమస్త జీవుల్లోనూ ఉంది. మానవ శరీరంలో కూడా ఉంది. శరీరంలో ఉన్నటువంటి భగవంతుడిని ఎలా ఆశ్రయించాలి అంటే? ఆయన్ని ఆశ్రయించే మార్గమే ఇప్పుడు మనమందరం చేస్తున్న "శ్వాస మీద ధ్యాస" ధ్యానం. ఇది తప్ప ఇంక ఏ రకమైన ధ్యానం వల్ల భగవంతుడిని ఆశ్రయించలేరు.

ఎలాగో తెలుసుకుందాం. మనమంతా మానవులం, మానవుడు అంటే శరీరము, మనసు, ఆత్మ. ఆత్మే భగవంతుడు, ఆత్మే పరబ్రహ్మ. ఇప్పుడు

ఈ “శ్వాస మీద ధ్యాస” ధ్యానంలో మొదట మనం కళ్ళు మూస్తాం. అంటే శరీరం లోపల మనసుతో ఉంటాం. ఎప్పుడైతే కళ్ళు మూసామో వెంటనే విపరీతమైన ఆలోచనలు వస్తాయి. అలా ఆలోచనలు వచ్చినప్పుడు కట్ చేసి మరల “శ్వాస మీద ధ్యాస” పెడతాం. ఎప్పుడైతే “శ్వాస మీద ధ్యాస” పెట్టామో మళ్ళీ ఆలోచనలు వస్తాయి, మళ్ళీ కట్ చేసి “శ్వాస మీద ధ్యాస” పెడతాం, ఇలా చేయగా చేయగా ఆలోచనలు తగ్గి తగ్గి ఒక స్థాయిలో ఆలోచనలన్నీ ఆగిపోతాయి.

ఎప్పుడైతే ఆలోచనలు ఆగిపోతాయో ఇక అక్కడ మనసు లేనట్టే. అక్కడ ఉండేది ఆత్మ ఒక్కటే. అంటే మనం భగవంతునితో ఉన్నాము? అలా ఎవరైతే భగవంతుని మీద దృష్టి పెట్టి ఉండిపోతారో వారు భగవంతునికి దగ్గర అవుతారు. అటువంటి వాళ్ళనే భగవంతుడు ఇష్టపడతాడు.

అలా భగవంతుడు ఇష్టపడే వాళ్ళ లిస్ట్‌లో ఆంజనేయ స్వామి ఉన్నాడు. ఎందుకంటే ఆయన ఎప్పుడూ ధ్యానంలోనే ఉంటాడు. ఆయనకి భగవంతుడు తప్ప ఇంకొక గొడవ లేదు. ఆయనకి ఏ కోరికలూ లేవు. ఆయన దృష్టి అంతా భగవంతుని మీదే ఉంటుంది.

మరి ఇప్పుడు ఎవరైనా భగవంతుడి గురించి ధ్యానంలోకి వస్తారా? అంటే రారు. రోగాలని కొంతమంది, పిల్లల గురించి కొంతమంది, ఆర్థిక సమస్యల గురించి కొంతమంది, ఇలా రకరకాల కోరికలతో ధ్యానంలోకి వస్తారు. కానీ ఎవరైతే ఏ కోరికలు, సంకల్పాలు లేకుండా భగవంతుని మీద దృష్టి పెడతారో అంటే ఆత్మ మీద దృష్టి పెడతారో వారే భగవంతునికి ఇష్టులు, వారు అదృష్టవంతులు.

చాలామందికి సంకల్పాలు పెట్టుకోకుండా ధ్యానం చేస్తే మాకు ఏమిటి ప్రయోజనం? మా కష్టం ఎలా పోతుంది? మా కోరికలు ఎలా తీరుతాయి? అనే సందేహం ఉంటుంది. కానీ ఒకటే గుర్తుపెట్టుకోండి మీరు

భగవంతుని మీద దృష్టి పెడితే మీకు కావలసినవన్నీ ఆయనే చూసుకుంటాడు.

మీకు ఈ కష్టం వచ్చిందని, మీకు ఈ కోరిక ఉందని ఆయనకి తెలియదా? భగవంతుడు వైకుంఠంలోనే ఉన్నాడా? మీ హృదయంలో లేడా? మరి మీ హృదయంలో ఉన్నవాడికి మీ కష్టం తెలియదా? మీ కోరిక ఏమిటో తెలియదా? మళ్లీ మీరు కోరాలా? అందుకే కోరవలసిన పనిలేదు, చేయవలసింది చేస్తే పొందవలసింది పొందుతారు.

కానీ మీరు చేయవలసిన దాని మీద దృష్టి పెట్టకుండా కోరవలసిన దాని మీదే దృష్టి పెడుతున్నారు. అందుచేతే నష్టపోతున్నారు. అంతరంలో ఉన్న ఆయనకి మీ తప్పులూ తెలుసు, మీరు చేసే పాపాలూ తెలుసు, అన్నీ తెలుసు. ఆయన తెలియని వాడేం కాదు. అందుచేత ఆయన మీద దృష్టి పెట్టండి. అదే మీరు చేయవలసింది. ఆ మార్గమే పత్రి గారు మనకిచ్చిన "శ్వాస మీద ధ్యాస" ధ్యానం.

అందుకే భగవద్గీతలో కృష్ణ భగవానుడు అన్నాడు.

**॥శ్లో॥ అనన్యాశ్చింతయన్తోమాం యే జనాః పర్యుపాసతే**
**తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్ (భ.గీ.9-22)**

తా:- ఎవరైతే ఇతర చింతలు లేకుండా నన్నే నమ్ముకుని నన్నే ధ్యానిస్తూ ఎల్లప్పుడూ నా యందే నిష్ఠ కలవారి యొక్క యోగక్షేమాలను నేనే చూసుకుంటాను.

అంటే నీకు ఎన్ని చింతలు అంటే నీ కోరికలు, కష్టాలు, సమస్యలు అన్నీ వదిలేసి నా మీద దృష్టి పెట్టు అన్నాడు. నా అంటే ఆత్మ మీద దృష్టి పెట్టు, నీ యోగక్షేమాలు నేను చూసుకుంటాను అన్నాడు.

ఇది అర్థమైనవాడు భగవంతుడ్ని కోరడు. అందుకే మనం ఈ సమస్యలు, కోరికల గురించి ప్రస్తావించం. ఒకటే చెప్తాం నువ్వు చేయవలసింది చెయ్యి పొందవలసింది పొందుతావు అని. ఎవరైనా ఏదైనా అడిగినా కూడా

ధ్యానం చేయండి అంటాం. ధ్యానం చేయడం అంటే భగవంతుని ఆశ్రయించడం. ఇప్పటిదాకా మనకి భగవంతుడు ఎవరో తెలియదు, ఆయన ఎక్కడ ఉంటాడో తెలియదు, ఆయన్ని ఎలా పట్టుకోవాలో తెలియదు, అయోమయంలో ఉన్నాం. పత్రి గారు వచ్చిన తర్వాత తెలుసుకున్నాం. ఎంత అదృష్టవంతులం!

20 ఏళ్ల క్రితం నేను వ్యాపారం చేసుకునే వాడిని, మా మేడం వంట చేసుకునేది. పత్రిగారు పరిచయమయ్యాక భగవంతుని ఆశ్రయించే ఈ ధ్యానం తెలుసుకోగలిగాం, ఇప్పుడు ఈ జ్ఞానం చెప్తూ ఈ స్థాయికి వచ్చాం. నేను వెంకటేశ్వర స్వామి వీరభక్తుడ్ని. రైస్ మిల్లు పక్కనే వెంకటేశ్వర స్వామి మందిరం కూడా కట్టించుకున్నాను. ఎంతో నిష్టగా పూజ చేసేవాడిని. పంతులు గారిలో మంత్ర దోషం ఏమైనా ఉన్నా కూడా పట్టుకునేవాడి. ఏంటి అన్నీ దాటించేస్తున్నావు అనేవాడిని.

గుళ్ళోనే భగవంతుడు ఉన్నాడు అనుకుని రోజూ రైస్ మిల్‌కి వచ్చేటప్పుడు, వెళ్లేటప్పుడు ఒకటే కోరిక కోరేవాడిని. ఇవాళ నా వ్యాపారంలో కలిసి రావాలి, నాకు ఏ లోటూ లేకుండా చూసుకో అని. కానీ ఆ వెంకటేశ్వర స్వామి నాలోనే అంతరాత్మ గా ఉన్నాడని అన్నమాచార్యుల వారి కీర్తన 'బ్రహ్మమొక్కటే పర బ్రహ్మమొక్కటే' అనే పాట ద్వారా తెలిసింది. అప్పటిదాకా అన్నమాచార్యుల పాటలు రాగయుక్తంగా ఉన్నాయని వినే వాడిని కానీ అందులో అంత అర్థం ఉందని పత్రిగారు పరిచయమయ్యాకే తెలిసింది.

అప్పటిదాకా వెంకటేశ్వర స్వామి తిరుమలలో ఉన్నాడు అనుకున్నాను. ఆయన తిరుమలలో కాదు, ప్రతి ఒక్కరి హృదయంలోనూ ఉన్నాడు అన్న సంగతి అప్పుడు అర్థమైంది. వెంకటేశ్వర స్వామి యొక్క ప్రతిరూపమే ఆయన అనుకుని ఆ ప్రతిరూపాన్ని దర్శించడానికి ప్రతి సంవత్సరం తిరుమల వెళ్ళేవాడిని. కానీ వెంకటేశ్వర స్వామి ప్రియ భక్తుడైన అన్నమాచార్యుల వారే

స్పష్టంగా చెప్పారు అసలైన వెంకటేశ్వర స్వామి ఆ శ్రీహరి మీ శరీరంలోనే ఉన్నాడు అని. ఎప్పుడైతే ఇది అర్థమైందో ఇంక అప్పటినుంచి గంటలు గంటలు కూర్చోవడం మొదలెట్టాను.

ఎప్పటినుంచి అలా మేమిద్దరం ఆయన మీద దృష్టి పెట్టామో మా జ్ఞానం ఎంతో పెరిగింది, మా శక్తి ఎంతో పెరిగింది. 80 పుస్తకాలు వ్రాసాము, యూట్యూబ్‌లో 4,500 వీడియోలు ఉన్నాయి. అంతకుముందు ఎవరైనా మాట్లాడమంటే మాట్లాడలేకపోయే వాళ్ళం. ఇవ్వాళ రోజులు తరబడి నెలలు తరబడి చెప్పగలుగుతున్నాం. ఈ నైపుణ్యం ఎక్కడి నుంచి వచ్చింది? ఆయన్ని పట్టుకోవడం వల్లే కదా నేను అందుకే చెప్తున్నాను, కోరికలతో ధ్యానం చేయకండి, మీ కోరికలు ఏమిటో ఆయనకు తెలుసు.

మీరు జ్ఞానులు అవ్వాలి, అందుకే జ్ఞానం సంపాదించుకోండి అంటాను. భగవంతుడు గురించి  అంటే ఆత్మ గురించి తెలుసుకోవడమే జ్ఞానం. భగవంతుడు గురించి తెలియకపోతే అజ్ఞానం. జ్ఞాని దుఃఖం నుంచి బయట పడతాడు. అజ్ఞాని దుఃఖంలో కూరుకుపోతాడు. అందుచేత గుర్తు పెట్టుకోండి భగవంతుడి నుంచి ఇష్టపడేవాళ్ళని అంటే కోరికలు కోరేవాళ్ళని ఆయన అసలు పట్టించుకోడు. ఎవరైతే ఆయన గురించి తెలుసుకొని ఆయన్ని ఆశ్రయిస్తారో ఆయనకి ఇష్టులు అవుతారు. వారి జన్మ ధన్యం అవుతుంది.

**శ్లో॥ ఆత్మౌ పంయేన సర్వత్ర పశ్యతి యోర్జున**
**సుఖం వాయది వా దుఃఖం స యోగి పరమో మతః (భ.గీ.16-32)**

తా: ఓ! అర్జునా ఎవడు సమస్త భూతముల యొక్క సుఖదుఃఖాలు, తన సుఖదుఃఖాలు గా చూస్తాడో, వాడే అందరిలో నాకెక్కువ ప్రియుడు.

అంటే నీ సుఖం ఎలాంటిదో ఇతర జీవుల సుఖం కూడా అలాంటిదే, నీ దుఃఖం ఎలాంటిదో అన్ని ప్రాణుల యొక్క దుఃఖం అలాంటిదే. నీ కష్టం ఎలాంటిదో అన్ని ప్రాణుల యొక్క కష్టం అలాంటిదే అని ఎవరైతే తెలుసుకొని

జీవిస్తారో వారు నాకు ఎక్కువ ఇష్టులు అన్నారు.

మీరు కూరలు కోస్తున్నప్పుడు వేలు కొంచెం లోతుగా తేగితే విపరీతంగా రక్తం వస్తుంది, చాలా బాధ కూడా పెడుతుంది. వెంటనే హాస్పిటల్కి పరిగెడతారు, కట్టు కట్టించుకుని ఇంజెక్షన్ చేయిస్తారు. తొందరగా తగ్గడానికి మందులు కూడా వాడతారు. అది బాగా తెగితే విపరీతమైన బాధ, పోటు పెడుతూ ఉంటుంది. ఆలోచించండి మీ వేలు తెగితేనే అంత బాధపడుతున్నారే ఒక కోడి పీక కోస్తే దానికెంత బాధ!

మీ బాధ లాంటిదే దాని బాధ కూడా అని మీరు తెలుసుకున్న రోజున ఒక కోడి పీకి కొయగలరా? ఆ కోడిని చంపగలరా? దాని మాంసం తినగలరా? ఖచ్చితంగా తినలేరు. మరి తింటున్నారు అంటే కోడి బాధ ఎంత ఉంటుందో మీరు తెలుసుకోలేదు. మీకు పదునైన కత్తి పెట్టి కోసేయడం చాలా తేలికే కానీ కోడికి ఆ బాధ భరించడం కష్టం.

అందుకే మీరు చూడండి వాటిని మేపేటప్పుడు ఆ గింజలు వేస్తారు, అవి ఎంతో ప్రేమతో  దగ్గరికి వస్తాయి. కానీ ఆ ఇంటికి ఎవరైనా చుట్టాలు వస్తే ఆ ఇంటి యజమానుల అభిప్రాయం మారిపోతుంది, వాళ్ళ చూపులు మారిపోతాయి. ఇది ఆ కోడికి అర్థమవుతుంది, ఇవాళ నా పని అయిపోయింది అని.

పాపం అది భయంతో దాక్కుంటుంది. వీళ్ళ పట్టుకోవడానికి చూస్తారు, అవి పారిపోవడానికి ప్రయత్నిస్తాయి, కానీ వాళ్ళు  మొత్తం మీద పట్టేస్తారు. దాని పీక కోసి, ఈకలు లాగేసి, ముక్క ముక్కలు చేసి వండి ఆ చుట్టాలకి పెడతారు. వాళ్ళని సంతోష పెట్టడానికి ఈ కోడిని దారుణంగా హింసిస్తారు.

వాళ్ళకి తెలీదు తన ప్రాణం లాంటిదే దాని ప్రాణం కూడా అని. నీ ప్రాణం తీస్తే నీకు ఎంత బాధో! వాటి ప్రాణం తీసినా వాటికీ అంతే బాధ.

అదే శ్రీకృష్ణుల వారు స్పష్టంగా చెప్పారు.

అంటే " ఓ అర్జునా! నేను ఆత్మను, సమస్త భూతాల్లో స్థితమై ఉన్నాను" అన్నాడు. అంటే పక్షుల్లో, జంతువుల్లో, జలచరాల్లో, క్రిమి కీటకాల్లో అన్నిటిలోనూ ఆయనే ఉన్నాడు. ఈ విషయం ఒక జ్ఞానికే తెలుస్తుంది. అందుచేత జ్ఞాని భక్షించడు రక్షిస్తాడు. తన బాధ ఎలాంటిదో వాటి బాధ కూడా అలాంటిదే అని తెలుసుకున్నవాడే జ్ఞాని. అందుకే జ్ఞాని నాకు ఇష్టుడు అన్నారు శ్రీ కృష్ణుల వారు.

అందుకే జ్ఞాని దేనినీ హింసించడు, దేనిని హింసించినా భగవంతుడ్ని హింసించినట్టే అని తెలిసినవాడు, దైవం అంటే ఇష్టం అన్నవాడు వాటిని ఎలా భక్షిస్తాడు? భక్షిస్తున్నాడు అంటే ఈ విషయం తెలియదనేగా.

అలాంటి హింసలు చేసి కష్టాలు తెచ్చుకొని తట్టుకోలేక నా కష్టాలు తొలగించమని ఆ దైవాన్ని ప్రార్థిస్తే, అర్థిస్తే ఎలా తొలగిస్తాడు? మీరు హింసించింది ఆయననే, ప్రార్థించేది ఆయననే. ఎంత విచిత్రం! భగవంతుడు ఎవరో తెలియని వాళ్ళు నాకు కష్టం వచ్చింది, నా కష్టం తీరిస్తే కోడిని బలిస్తాను, మేకని బలిస్తాను అంటూ ఒక బొమ్మకు మొక్కుతారు. అంటే భగవంతుడ్నే బొమ్మకు మొక్కి, బలి ఇస్తారు. మరి వీరి కష్టాలు ఎలా పోతాయి చెప్పండి!

అంత అజ్ఞాన దశలో ఉన్నారు. మానవులు ఇంత అజ్ఞానంలో కూరుకుపోయి చేయకూడని పనులు చేస్తున్నారు. మరి ఆయన్నే హింసించే వాళ్ళ కోరికలు ఆయన ఎలా తీరుస్తాడు? అందుచేత ఆయన అందరికంటే జ్ఞానే నాకు ఇష్టుడు అన్నారు. జ్ఞాని జీవులని హింసించడు, వాటితో స్నేహం చేస్తాడు.

బలులిచ్చే ఆచారం తరతరాల నుంచి వస్తూనే ఉంది. అందుచేత ఈ మూఢాచారం సమాజంలో పోవట్లేదు. మరి ఈ ఆచారం అలాగే ఎందుకు

కొనసాగుతుంది? పత్రి గారి లాంటి వాళ్ళు ఎంతో మంది వచ్చి ఎన్నో రకాలుగా చెప్పినా మానకపోవడానికి కారణం  కూడా భగవద్గీతలోనే చెప్పబడింది.

మీరు గమనించండి ఎన్ని శాఖాహార ర్యాలీలు జరుగుతున్నా హింస ఎక్కడైనా తగ్గిందా? మనోళ్ళు ఎన్ని పాంప్లెట్లు పంచిపెడుతున్నా,  పుస్తకాలు ఇస్తున్నా కూడా  తగ్గలేదు. అంతెందుకు ఈ ధ్యానుల ఇళ్లలో కూడా ఇంకా మాంస భక్షణ చేస్తూనే ఉన్నారు. నేను ఎన్నో ఊళ్ళకు తిరిగాను, ఎంతో మంది ఇళ్లకి వెళ్ళాను. ఈ ర్యాలీలకి వచ్చేవాళ్ళు కూడా మీ ఇంట్లో మానేసారా అంటే మేము మానేసామండి. మా ఇంట్లో వాళ్ళు తింటున్నారు వాళ్ళకి వండుతామండి అంటారు.

పూర్తిగా మాంసాహారం మానేసిన భార్యాభర్తలు, పిల్లలు, బంధువులు అందరూ మానేసినటువంటి సంసారం దొరుకుతుందా? అంటే దొరకట్లేదు. ఎక్కడికి వెళ్ళినా అదే పరిస్థితి. మరి  దీనికి కారణం ఏంటి అంటే? ఈ విషయాలన్నీ చెప్తే వింటారు కానీ వాళ్ళకి అసలు ఎక్కదు. ఇంకా కొంతమంది మానేసామండి కాని పాత్రలు ఇంకా మార్చలేదు అంటారు.

పత్రి గారేమో ఖచ్చితంగా ఆ పాత్రలు వాడకూడదు అంటారు. ఈ శాఖాహార ర్యాలీలో కూడా బయట నుంచి పాత్రలు అద్దికి తీసుకువచ్చి వండుతారు. అద్దెకి ఇచ్చేవాడు వాళ్ళకీ ఇస్తాడు, వీళ్ళకీ ఇస్తాడు. అందరూ మనోళ్ళే  అనుకుంటారు. నేను అందుకే మనోళ్ళకి చెప్తుంటాను ఏదో క్లాసులకి వెళ్ళి గమ్మున అక్కడ వండినవి తినేస్తారు. అలా తింటే చాలా దెబ్బ తింటారు అని తెలుసుకోవాలి.

మరి ఎందుకు మానట్లేదు అన్నదానికి కారణం గీతలోనే ఇవ్వడం జరిగింది.

**శ్లో॥  తా నహం ద్విషతః క్రూరా స్సంసారేషు నరాధమాన్,**

**క్షపామ్య జస్ర మశుభా నాసురీస్వేవ  యోనిషు    (భ.గీ.16-19)**

తా: సర్వ జీవుల యందు ఆత్మస్వరూపుడి నైవున్న నన్ను హింసించు క్రూరులైన దుష్టులను, జనన మరణములతో ఉండు దుఃఖకరమైన ఘోర సంసార మందు మాటిమాటికి పడవేసి, వారిని బహు దుఃఖకరమైన అసురయోనులందు పుట్టించెదను అన్నారు.

ఆయన సమస్త జీవుల్లో నేను ఆత్మ స్వరూపుడై ఉన్నాను. అలా నేను ఉన్న ఆ జీవిని హింసిస్తే నన్ను హింసించినట్టే! ఎవరైతే అలా హింసిస్తారో అలాంటి వారిని జనన మరణములతో కూడిన దుఃఖకరమైన ఘోర సంసారంలో మరల మరల పడవేసి అసుర యోనుల యందు పుట్టించెదను అన్నాడు. ఎవరైనా జన్మించేది యోని ద్వారానే. అసురులు అంటే రాక్షసులు, రక్త మాంసాలు తినేవారు. అలాంటి కుటుంబంలోని స్త్రీ గర్భంలో పడవేసి జన్మించేటట్టు చేస్తాను అన్నాడు.

ఎన్నో జన్మలు అలాంటి శరీరాలే తీసుకుంటారు. అలాంటి తల్లి గర్భాలే వాళ్ళకి వస్తాయి, మనోళ్ళు మాంసం తినద్దు అంటే చాలు చాల్లే మా నాన్న తిన్నాడు, మా తాత తిన్నాడు, నన్ను తినొద్దంటావేంటి అంటారు. అంటే దాని అర్థం ఏమిటి తరతరాలు అలాంటి స్త్రీలకు జన్మించారు వీళ్ళు. ఎందుకు జన్మించారు? ఎవరు భగవంతుని ఇలా హింసిస్తారో వాళ్ళకి అలాంటి గతే పడుతుంది. ఇలా ఎన్నో జన్మలు అలాంటి సంసారంలో పుడుతూ పాపం పెంచుకుంటూనే ఉంటారు.

ఆయన ఇంకా ఏమన్నారంటే.

**శ్లో॥ అసురీం యోని మాపన్నా మూఢా జన్మని జన్మని**
**మా మప్రాప్యైయివ కౌంతేయా తతో యాన్త్యధమాం గతిమ్:**
**(భ.గీ. 16-20)**

తా: ఓ అర్జునా! అట్లు అసుర యోనులందు పుట్టిన ప్రాణిహింసకులైన మూడులు ప్రతి జన్మనందు నన్ను పొందు మార్గము తెలియక, అందుండి

అధోగతి పొంది, బహుకాలం దుఃఖకరమైన ఘోర నరకమును పొందుదురు.

ఇప్పుడు ఎవ్వరైనా సరే భగవంతుని పొందితేనే దుఃఖం నుంచి శాశ్వతంగా బయటపడతారు. అంతే కానీ భగవంతుడు ఎవరో తెలియకుండా, ఆయన్ని ఎలా పట్టుకోవాలో తెలియకుండా ఎలా పొందుతారు? భగవంతుడిని పొందకపోతే దుఃఖం నుంచి బయట పడలేరు. అలా ఎన్నో జన్మలు నరకం అనుభవిస్తారు. ఇప్పుడు మీలో చాలామంది మాంసం తినే కుటుంబంలో పుట్టి మాంసం ఎందుకు మానేశారు? ఇది పూర్వజన్మ సుకృతమే. మరి అటువంటి కుటుంబంలో పుట్టాం కదా? అంటే భగవంతుడు మీకు పరీక్ష పెట్టాడు.

అటువంటి కుటుంబంలో పుట్టినా మీరు దానికి దూరంగా ఉంటారా? లేదా? అని పరీక్షించుకున్నాడాయన. మీలో చాలామంది ఆ కుటుంబంలో పుట్టినా నేను తినను, భగవంతుడు మెప్పు పొందుతాను అని సవాలు చేసి వచ్చారు. అలా నూటికి ఒక్కడు కాదు కోటికి ఒక్కడు ఉంటాడు. మీలాంటివాళ్ళు ఎన్ని అవాంతరాలు వచ్చినా, ఎన్ని ఆటంకాలు వచ్చినా, ఎన్ని అవరోధాలు వచ్చినా ధ్యానం వదలకుండా కొనసాగిస్తే నిజంగా మీరు అన్ని పరీక్షలూ తట్టుకుని పాస్ అయినట్టే లెక్క. ఖచ్చితంగా మీకు మరుజన్మ అద్భుతమైన జన్మ వస్తుంది.

ఈ మార్గంలోకి వచ్చినటువంటి యోగి ఈ ధ్యానంలో పరాకాష్టకు చేరకపోయినా, శరీరం వదిలితే మరుజన్మలో శ్రీమంతుల గృహంలో కానీ, యోగుల గృహంలో కానీ జన్మించి తదనంతర సాధన పూర్తి చేసుకుని మోక్షాన్ని పొందుతారు అని గీతలోనే చెప్పారు. అందుచేత మీరు కొంచెం ఈ జన్మలో కఠినంగా వ్యవహరించాలి తప్పదు. అలా పుట్టడం పరీక్ష అనుకోండి. ఆ కులం మీది కాదు, ఆ కుటుంబం మీది కాదు, ఆ మతం మీది కాదు, ఎవరు మీరు? మీరందరూ ఆత్మలు కొన్ని అనుభవాల కోసమే ఇలాంటి జన్మ

తీసుకున్నారు అని మర్చిపోకండి.

భగవంతునికి ఇష్టులు అవ్వాలంటే మనం ఆ రకంగా జీవిస్తున్నామా? లేదా? మన ప్రవర్తన ఆ విధంగా ఉందా? లేదా? అన్నది చూసుకోవాలి. ఆయన చెప్పిన దాంట్లో ఏ విషయాలైనా విరుద్ధంగా ఉంటే వాటిని సరి చేసుకోవాలి. భగవంతుని స్థితి పొందాలి అంటే భగవంతుడు చెప్పినవి పాటించాలి. మరి ఆయన ఏం చెప్పాడు?

**శ్లో॥ యో న హృష్యతి న ద్వేష్టి న శోచతి న కాంక్షతి**
**శుభా శుభ పరిత్యాగీ భక్తిమాన్ యస్సమే ప్రియః (భ.గీ.12 -17)**

తా: ఎవడు సంతోషింపడో! ద్వేషింపడో! శోకమును పొందడో! ఎవడు కోరడో! ఎవడు శుభా శుభములను వదిలినవాడో! (మంచి-చెడు, పుణ్యము - పాపము ) అట్టి భక్తుడు నాకు ఇష్టుడు.

ఎవడు సంతోషింపడో అన్నారు అంటే ఏదో కొద్దిగా వస్తే సంబరపడకూడదు, ఏదైనా జరిగితే బాధపడకూడదు. మంచి జరిగినా, చెడు జరిగినా, లాభం వచ్చినా, నష్టం వచ్చినా ఎందుకు జరిగిందో జరగనీ!

అలాగే ఎవడు ద్వేషింపడో అన్నారు. ఎవరిని ద్వేషిస్తారు? ఇతరులని ద్వేషిస్తారు. ఇతరులు ఎవరు? వారూ ఆత్మలే, మీరూ ఆత్మే. ఇతరులని మీరు ద్వేషించారంటే అంతా ఒకటే అనే స్థాయికి ఇంకా మీరు రాలేదు అని అర్థం. ఆ ద్వేషం తోటే విమర్శిస్తారు. అందుకే వీటన్నిటికీ అతీతంగా మీరు ఉండాలి.

అలాగే ఎవడు శోకమును పొందడో అన్నారు. అంటే ఎవడు ఏడవడో, ఎవడు బాధపడడో అటువంటి వాడు నాకు ఇష్టుడు అన్నారు. యుద్ధానికి ముందు అర్జునుడు నా వాళ్ళందరినీ నేను చంపడమా? అని చిన్న పిల్లవాడిలా శోకించాడు. అప్పుడు కృష్ణుడు అన్నాడు. నువ్వు ఎక్కడ చంపుతావు? నువ్వేదో చంపుతున్నానని అనుకుంటున్నావు. నువ్వు చంపక పోయినా వాళ్ళు చచ్చే ఉన్నారు.

నిజానికి అసలు ఎవరికీ చావు లేదు. చనిపోతే ఇంక ఉండరు కదా అనే వాళ్ళే చచ్చి వాడు ఏ లోకానికి వెళ్ళాడో అంటారు. అంటే చనిపోయాక ఉన్నాడని అంగీకరించినట్టేగా!

అందుచేత ఎవరైనా చనిపోయినప్పుడు శోకిస్తే ఇంకా ఆ స్థాయికి మీరు ఎదగలేదనే అర్థం. ఆ స్థితికి ఎదగాలి, మీ ప్రవర్తన ఆ రకంగా ఉండాలి. అలాంటివాడు నాకు ఇష్టుడు అన్నాడాయన.

ఎవరు కోరడో అన్నారు! మీరు కోరుతున్నారు అంటే ఇంకా ఎదగలేదు అని లెక్క, మీరెవరో మీరు తెలుసుకోలేదు. మీరెవరు? ఆత్మ. ఆత్మ అంటే ఎవరు? పరబ్రహ్మ. మీరే పరబ్రహ్మ అయితే సమస్తమూ మీదే కదా? ఇంక మీరు కోరేది ఏమిటి? మీది కానిది ఏదైనా ఉంటే మీరు కోరొచ్చు. కోరుతున్నారు అంటే ఈ సత్యం మీకు ఇంకా తెలుసుకోలేదు.

అంతా ఆత్మలమే అని పత్రి గారు చెప్పారు కదా? ఆత్మే పరబ్రహ్మ అని, అంత గొప్పవాడైన పరబ్రహ్మే ఆత్మ అని, ఆ ఆత్మే మీరు అని తెలుసు కోవాలి. పరబ్రహ్మే సత్యము, ఆయనే సృష్టికర్త, ఆయనే సృష్టిని నడిపించే వాడు. మీరు దేహం అనుకుంటున్నారు కాబట్టే నేను సృష్టింపబడ్డాను అనుకుంటున్నారు. మీరు పరబ్రహ్మ అని తెలుసుకున్నప్పుడు మీకు అర్థమయ్యేది ఏమిటంటే?

ఉన్నది మీరే, ఏదీ లేదు. ఈ దేహం చూసుకుంటూ నాకు పిల్లలు ఉన్నారు అనుకుంటూ, తల్లిదండ్రులు ఉన్నారు అనుకుంటూ, బంధువులు ఉన్నారు అనుకుంటూ, దుఃఖానికి లోనవుతున్నారు. ఈ లక్షణాలన్నీ ప్రదర్శిస్తున్నారు.

మీరెవరో తెలుసుకున్న రోజున అటువంటి పరిస్థితి ఉండదు. మీరు ఎవరో తెలిస్తే మొగుడు ఉన్నాడో లేదో తెలుస్తుంది. పెళ్ళాం ఉందో లేదో తెలుస్తుంది. పిల్లలు ఉన్నారో లేదో తెలుస్తుంది. మీరు ఎవరో తెలియకే ఈ

గోలంతా.

ఇవన్నీ ఉండేవని భావించబట్టే ఇంత దుఃఖం. మీరెవరో తెలుసుకుంటే మీకు దుఃఖమే లేదు. ఈ లక్షణాలన్నీ మీలో ప్రతిబింబిస్తాయి. ఆ స్థితికి ఎదిగిన వాడు నాకు ఇష్టుడు అన్నాడాయన. మీరు దేహము అని భావిస్తూ ఉంటే ఏమేమి ఉండకూడదని కృష్ణుడు చెప్పాడో ఖచ్చితంగా అవన్నీ ఉంటాయి. వీటితోటే బందీ అయిపోయారు. దాన్నే బంధము అంటారు. అసలు మీకు దేనితోటి సంబంధం లేదు. అన్నీ తగిలించుకుంటూ అన్నీ పొందుతున్నారు.

అందుచేత  కోరారు అంటే ఇంకా బంధంలో ఉన్నట్టే. అందుకే రమణ మహర్షి నువ్వు ఎవరో తెలుసుకో అని ఒక్కటే చెప్పేవాడు. చాలామంది తెలుసుకోవడానికి ఏముందండి? నేను ఆత్మనే కదా? అని సింపుల్ గా చెప్తారు. మరి నిజంగా తాము ఆత్మ అన్నది అర్థమైతే శ్రీ కృష్ణుడు చెప్పిన ఇవన్నీ ఎందుకుంటాయి?

నేను ఆత్మ అని నాకు తెలుసు అంటారు. మళ్ళీ నాకు ఈ సమస్య వచ్చింది, ఇందులో నుంచి ఎలా బయటపడాలండి అంటారు? ఇంకేం తెలుసుకున్నట్టు? ఇప్పుడు కృష్ణుడుకి ఇష్టుడు అవ్వాలి అంటే ఎన్ని తెలుసుకోవాలో చూడండి.

అలాగే ఎవడు శుభాశుభములను వదిలినవాడో అట్టి భక్తుడు నాకు ఇష్టుడు అన్నారాయన. పత్రి గారు కూడా పాపం వద్దు, పుణ్యము వద్దు అన్నారు. నేను నాది పోవాలంటారు. నేను ఉంటేనే నాది ఉంటుంది. నేను లేకపోతే నాది ఎక్కడ ఉంది!

అలాగే 12వ అధ్యాయంలో 13, 14 శ్లోకాల ద్వారా కూడా ఎవరు తనకు ఇష్టులో ఆయన బోధించడం జరిగింది.

**శ్లో॥ అద్వేష్టా సర్వభూతానాం మైత్ర: కరుణ ఏవచ**
**నిర్మమో నిరహంకారః సమదుఃఖ సుఖః క్షమీ. ( భ. గీ. 12-13 )**
**శ్లో! సంతుష్టస్సతతం యోగీ యతాత్మా దృఢనిశ్చయ:**
**మయ్యర్పిత మనో బుద్ధిర్యో మద్భక్తస్స మే ప్రియ: ( భ.గీ. 12-14.)**

తా:- సమస్త ప్రాణులయెడల ద్వేషము లేనివాడు, వాటిపట్ల మైత్రి, కరుణ కలవాడు, అహంకార, మమకారం లేనివాడు సుఖ, దుఃఖాలలో సమభావం కలవాడు, క్షమాగుణం అంటే ఓర్పుకలవాడు.

అంతేకాదు ఎల్లప్పుడూ సంతృప్తితో ఉండేవాడు, యోగయుక్తుడు, మనస్సును స్వాధీన పరచుకున్నవాడు, దృఢమైన నిశ్చయము గలవాడు, నాయందు అంటే ఆత్మయందు సమర్పించబడిన మనోబుద్ధులు కలవాడు, నాయందు (ఆత్మయందు) భక్తి గలవాడు, ఎవడుకలడో! అతడు నాకు ఇష్టుడు

ఈ లక్షణాలన్నీ ఉండాలి, ఈ రకమైన ప్రవర్తన ఉండాలి. ఇవేమీ లేకుండా నేను రోజూ కొబ్బరికాయ కొడుతున్నాను, డిబ్బీలో డబ్బులు వేస్తున్నాను, రోజూ దణ్ణం పెట్టుకుంటున్నాను, ఆయనంటే నాకు చాలా ఇష్టం అనుకుంటే సరిపోదు. ఆయనకి నువ్వు ఇష్టుడు అవ్వాలి అని స్పష్టంగా చెప్పాడు.

సమస్త ప్రాణుల పట్ల ద్వేషము లేనివాడు అన్నాడు. ఎందుకు అంటే? ఆ ప్రాణులు ఆయన స్వరూపమే కాబట్టి. పైకి కనిపించే వాటి స్వరూపాలు అదృశ్యం అయిపోతాయి ఉండవు.

కాని ఆ కనిపించే స్వరూపాలే నువ్వు నిజం అనుకుని, అవి జంతువులు, ఇవి పక్షులు, కీటకాలు, జలచరాలు అనుకుంటున్నావు. కానీ అవన్నీ అదృశ్యమయ్యేవే, మాయమయ్యేవే, అంతా మాయే! అజ్ఞానంతో ఆ మాయమయ్యే వాటి ప్రభావంలో ఇలా ప్రదర్శిస్తున్నావు. కాని నువ్వు శరీరం వదిలేస్తే వాస్తవంలో ఉంటావు, అన్నీ భగవంతుని స్వరూపాలని తెలుసు కుంటావు.

కానీ ఎవరైతే శరీరం ఉండగానే వాస్తవంలో జీవించగలుగుతారో వారు ఈ లక్షణాలన్నీ ప్రదర్శించగలుగుతారు. ఈ మాయలో ఉంటే నేను అనే అహంకారం ఉంటుంది, నా వాళ్ళనే మమకారం ఉంటుంది. నా వాళ్ళకి ఏదో సహాయం చేయాలి, పాపం ఇబ్బందుల్లో ఉన్నారు, నేను చేయకపోతే ఎలా? అనే మమకారం ఉంటుంది, ఆశ ఉంటుంది, కోరికలుంటాయి, అభిమానం ఉంటుంది, ద్వేషం ఉంటుంది.

మాయ బలీయమైనది, ప్రతీ ఒక్కరి మీద ఈ మాయా ప్రభావం ఉంటుంది. ముందు నేను నేను అంటారు, వయసొచ్చాక పెళ్లి చేసుకుంటారు నా భార్య, నా భర్త అంటారు. ఇంకొన్నాళ్ళు పోతే నా కొడుకు, నా కూతురు అంటారు. అక్కడికీ పాపం ఇవన్నీ తెలుసుకోవడానికి, సరదాలు తీర్చుకోడానికి ఆ సృష్టికర్త ఎన్ని జన్మలు కావాలంటే అన్ని జన్మలు ఇస్తున్నాడు. కాని ఎన్ని జన్మల్లో తీర్చుకుంటున్నా, ఇంకా ఆ సరదా తీరట్లేదు.

మరి భగవంతుడికి ఇష్టుడు అవ్వాలంటే ఈ మమకారాలు వదలాలి. 300 జన్మలు అయినా, 400 అయినా, 500 అయినా మమకారం పోయినప్పుడే వారి మీద భ్రాంతి పోతుంది. బంధం నుంచి బయటపడితే గాని ముక్తి, మోక్షం అన్నది రాదు.

సీతాదేవికి లక్ష్మణుడు ఒక గీత గీసి దాన్ని దాటొద్దు అన్నాడు. దాన్నే లక్ష్మణ రేఖ అంటారు. ఆ గీత దాటితే నువ్వు ప్రమాదంలో పడతావు అని చెప్పి వెళ్ళాడు. ఆ లక్ష్మణ రేఖ లోపల ఉన్నంతవరకు రావణాసురుడు ఏమీ చేయలేకపోయాడు. ఆ రేఖ సీతాదేవికి అంత రక్షణ కల్పించింది, కానీ ఎప్పుడైతే సీతాదేవి రేఖ దాటిందో రావణాసురుడు ఆవిడని ఎత్తుకుపోవడం జరిగింది. అంత గొప్పది లక్ష్మణుడు గీసిన గీత.

అలాగే భగవద్గీత అన్నది శ్రీకృష్ణుల వారు గీసిన గీతగా చెప్పుకోవచ్చు. ఆ గీత పరిధిలో ఉన్నంతవరకు అంటే ఆ గీతను పాటించినంతవరకు ఎవరికీ

ఏ ఇబ్బంది లేదు, ఏ ప్రమాదము లేదు. కానీ ఎవరైతే గీతను దాటతారో! ఆ గీతలో చెప్పిన వాటిని పాటించరో! వారు కష్టాలకు లోను కావలసిందే. మరి శ్రీకృష్ణులవారు గీతలో చెప్పింది ఒకటి, మానవులు చేసేది ఇంకొకటి. అలా ఉల్లంఘిస్తే కష్టాలకు లోను కావాల్సిందే. అందుచేత ఆయన ఏం చెప్పాడు? లోకులు ఏం చేస్తున్నారు? అన్న దాన్ని తెలుసుకుందాం.

గీతని ఎన్నిసార్లు పారాయణ చేసినా ఉపయోగం లేదు. కానీ గీతలో చెప్పిన వాటిని అర్థం చేసుకొని ఆచరించిన వారి జీవితం ధన్యమవుతుంది.

చూడండి ఒక స్కూల్ పిల్లవాడిని పాలు తాగితే బలం అని బట్టీపట్టమని హోమ్ వర్క్ ఇస్తే " వాడు పాలు తాగితే బలం", "పాలు తాగితే బలం" అని ఒక గంట కూర్చుని చదివాడు. మరి అలా వెయ్యి సార్లు చదివితే బలం వస్తుందా? వాడి కండలు ఏమైనా పెరుగుతాయా! పెరగవు. ఎప్పుడు వస్తుంది బలం? అంటే త్రాగితే వస్తుంది.

అలాగే భగవద్గీత చదివితే పుణ్యం అని 100 సార్లు చదివినా, 1000 సార్లు చదివినా పుణ్యం రాదు? కాని గీతలో చెప్పింది అర్థం చేసుకుని ఆచరిస్తే వస్తుంది, అంత గొప్పది భగవద్గీత. భారతదేశంలో కాశ్మీర్ నుంచి కన్యాకుమారి దాకా భగవద్గీతే ప్రతి ఒక్కరికి ప్రామాణికం, అందులో లేనిదంటూ లేదు. ఎక్కడికి వెళ్ళినా శ్రీకృష్ణుడ్ని కాదనేవాడు లేడు.

పత్రి గారు మనకి గీతలో 70 శ్లోకాలు ఏరి శ్రీ కృష్ణ సందేశం అనే పుస్తకం వ్రాశారు. ఇవి మీరు అర్థం చేసుకుంటే గీతఅంతా అర్థం చేసుకున్నట్టే అన్నారాయన. ఇంక ఎన్ని శ్లోకాలు చదివినా అందులో ఉన్న అర్థమే వస్తుంది.

అందుచేత ఆ 70 శ్లోకాలు చదవాలి, వాటిని అర్థం చేసుకోవాలి, ఆచరించే ప్రయత్నం చేయాలి. గీతలో చెప్పినవి ఆచరించే శక్తి పత్రి గారు మనకు ఇచ్చినటువంటి "శ్వాస మీద ధ్యాస" ధ్యానం వల్ల మాత్రమే వస్తుంది.

"శ్వాస మీద ధ్యాస" ఉంచి ధ్యానం చేస్తే ఆచరించే శక్తి ఎలా వస్తుంది? అని మీకు సందేహం రావచ్చు. "శ్వాస మీద ధ్యాస" మీరు తీవ్రంగా చేసే కొద్దీ మీకు తెలియకుండానే మీ శక్తి పెరుగుతూ ఉంటుంది. శక్తి పెరిగే కొద్దీ మీ మనసు శుద్ధి అవుతుంది, మనసులో ఉన్న మలినాలన్నీ పోతూ ఉంటాయి. అప్పుడు మీ గుణం కూడా మారుతూ ఉంటుంది, గుణం మారే కొద్దీ విలువ కట్టలేని మీ బుద్ధి వికసిస్తూ ఉంటుంది, అంటే చురుకుగా తయారవుతుంది. ఎప్పుడైతే బుద్ధి వికసిస్తుందో అప్పుడు ఒక్కసారి చదివినా దాని లోతు అర్థాలు మీరు గ్రహించగలుగుతారు. ఎప్పుడైతే అర్థం గ్రహించారో ఎవరూ చెప్పనవసరం లేకుండా మీ అంతట మీరే ఆచరిస్తారు.

ఇప్పుడు ఇంటికి వెళ్లాక కూడా ధ్యానం బాగా చేయండి అని మేము చెప్తాం. వెంటనే ఇక్కడ అంటే వీలవుతుంది కాని ఇంటి దగ్గర మాకు ఎక్కడ అవుతుంది? అని వంకలు చెప్తారు. కానీ ఎన్ని వంకలున్నా, ఎన్ని ఇబ్బందులున్నా, ఎలాంటి పరిస్థితులున్నా, మీ బుద్ధి బాగా పని చేస్తుంటే వాటన్నిటికీ పరిష్కారం మీ బుద్ధే మీకు సూచిస్తుంది. ఒక రకంగా చెప్పాలంటే వికసించిన మీ బుద్ధే మీకు సద్గురువు.

**శ్లో: అద్వేష్టా సర్వభూతానాం మైత్రః కరుణ ఏవ చ**
**నిర్మమో నిరహంకారః సమదుఃఖసుఖః క్షమీ ( భ.గీ.12 - 13 )**

**శ్లో: సంతుష్టః సతతం యోగీ యతాత్మా దృఢనిశ్చయః**
**మయ్యర్పితమనోబుద్ధిర్యో మద్భక్తః స మే ప్రియః ( భ.గీ.12 - 14 )**

తా: సమస్త ప్రాణుల యెడల ద్వేషము లేనివాడు, వాటి పట్ల మైత్రి కరుణ కలవాడు, అహంకార మమకారాలు లేనివాడు, సుఖ దుఃఖాలలో సమభావం కలవాడు, క్షమా గుణం అంటే ఓర్పు కలవాడు,

ఎల్లప్పుడూ సంతృప్తితో ఉండేవాడు, యోగయుక్తుడు, మనసును స్వాధీన పరచుకున్నవాడు, దృఢమైన నిశ్చయము కలవాడు, నా యందు

అంటే ఆత్మ యందు సమర్పించబడిన మనోబుద్ధులు కలవాడు, నా యందు అంటే ఆత్మ యందు భక్తి కలవాడు ఎవడు కలడో అతడు నాకు ఇష్టుడు అన్నాడు. అంటే భగవంతునికి ఇష్టులు అవ్వాలంటే ఈ లక్షణాలన్నీ కలిగి ఉండాలి.

సమస్త ప్రాణుల యెడల ద్వేషము లేనివాడు అన్నారు. ఏ ప్రాణినైనా సరే మనం ప్రేమించాలి కానీ ద్వేషించకూడదు. అది కోడి అవ్వచ్చు, మేక అవ్వచ్చు, చేప అవ్వచ్చు, క్రిమి కీటకాలు అవ్వచ్చు ఏ జీవి అయినా అవ్వచ్చు. వాటి పట్ల ద్వేషం ఉండకూడదు అన్నాడు. ఎప్పుడైతే నువ్వు ద్వేషించడం మాని వాటిని ప్రేమిస్తావో వాటి పట్ల స్నేహ భావంతో ప్రవర్తిస్తావు.

గీతలో ఏదైతే చెప్పబడిందో పత్రి గారు కూడా అదే చెప్పారు. ప్రతి జీవి పట్ల స్నేహ భావంతో ఉండాలని. నువ్వు ఆత్మవే, వాటిలో ఉన్నది ఆత్మే అంటే అవి నీ స్నేహితులు. వాటిపై నీకు కరుణ ఉండాలి, అవి నీ కంటే తక్కువ స్థాయిలో ఉన్నా, నువ్వు బాగా ఎదిగిన వాడివి అవి ఎదుగుతున్నవి అంతే తేడా.

గుర్తుపెట్టుకోండి "కాబోయే మానవులే ఇప్పుడున్న జంతువులు, పక్షులు. మరి మీరేమో ఎదిగినటువంటి కోళ్ళు, మేకలు". మీరు నేను మానవుడిని మానవుడిని అంటారు. అంతకుముందు మీరు అంతే, అందుచేత వాటితో స్నేహంగా ఉండాలి, వాటి మీద కరుణ చూపించాలి. నువ్వేదో గొప్ప అవి తక్కువ అనుకుంటున్నావు కొన్ని జన్మలు అయిపోతే అవి కూడా మీలాగే మానవ జన్మ తీసుకుని డ్రెస్ వేసుకొని వస్తాయి.

అందుచేత ఎవరైతే సాటి ప్రాణుల పట్ల స్నేహ భావంతో ఉంటారో, వాటి పట్ల కరుణ చూపిస్తారో అట్టివారు నాకు ఇష్టులు అన్నారు శ్రీ కృష్ణుల వారు. మరి రాక్షసంగా ప్రవర్తించి, వాటిని చంపి, హింసించి, భక్షించేవారు ఆయనకి ఎప్పటికీ ఇష్టులు కాలేరు. ఆయనకి ఇష్టులు కాకపోతే ఆయన

అనుగ్రహం ఎలా వస్తుంది? ఆయన అనుగ్రహం లేకపోతే మీ జీవితం ధన్యం ఎలా అవుతుంది? అందుకే పత్రి గారు జీవ హింస చేయకూడదు అని చెప్తారు.

ఇంకా ఏమన్నారంటే? అహంకార మమకారాలు ఉండకూడదు అన్నారు. నేను అనే అహంకారం, నేను ఎంత గొప్పవాడిని, ఇన్ని పనులు చేస్తున్నాను, ఇన్ని క్లాసులు చెప్తున్నాను, ఇంతమందికి జ్ఞానం బోధిస్తున్నాను, నేను ఇంతమందికి దారి చూపిస్తున్నాను అనే అహంకారం ఉండకూడదు. అలాగే ఇది నాది, వీళ్ళు నా వాళ్ళు, నా పిల్లలు అనే మమ్మకారం ఉండకూడదు అన్నాడు.

అలాగే సుఖ దుఃఖాల్లో సమభావం కలవాడు అన్నారు. ఈ ధ్యానంలోకి రాకముందు అందరికీ దుఃఖము ఉండేది. సుఖ భ్రాంతి ఉండేది. కానీ ఇప్పుడు ఏం జరిగినా దుఃఖము లేదు, సుఖము భ్రాంతి లేదు. మీకు డబ్బు రావాల్సి ఉన్నా రాలేదని దుఃఖ పడరు. మీరు "వస్తేరాని, ఉంటే ఉండని, పోతే పోని" అనే స్థాయికి ఎదిగిపోయారు.

ఆయన ఇంకా ఏం చెప్పారంటే ఎల్లప్పుడూ సంతృప్తితో ఉండేవాడు అన్నారు. ఈ మార్గంలోకి వచ్చాక మన వాళ్ళంతా కూడా ఉన్న దానితో సంతృప్తిగా ఉంటున్నారు. దేనికీ ఆశపడటం లేదు.

అలాగే యోగయుక్తుడు అంటే యోగాన్ని అభ్యసించేవాడు అంటే "శ్వాస మీద ధ్యాస" ఉంచి ధ్యానం చేసేవాడు, చిత్తవృత్తులు నిరోధించుకోవాలని ప్రయత్నించేవాడు అన్నారు. మీరంతా కూడా ఆ పనే చేస్తున్నారు.

ఇంకా మనసును స్వాధీన పరచుకున్నవాడు అన్నారు. మనసును స్వాధీన పరచుకోవడం అంటే మీరు చెప్పినట్టు మనసు వినాలి, మనసు చెప్పినట్టు మీరు వింటే మనసు మీ స్వాధీనంలో లేనట్టే.

అలాగే దృఢమైన నిశ్చయం కలవాడు. అంటే అనుకున్న పని ఆరు నూరైనా, నూరు ఆరైనా చేసి తీరేవాడు. మరి మీరంతా భీమవరం రావాలంటే

వస్తున్నారు. ఆయన నా యందు అంటే ఆత్మ యందు భక్తి కలవాడు అన్నారు. అలా ఎవడు కలడో వాడు నాకు ఇష్టుడు అన్నారు. అంటే ఎవరికైతే ఆత్మ యందు ఇష్టం ఉంటుందో వాళ్ళు నాకు ఇష్టం అన్నాడు. ఆత్మ యందు ఇష్టం ఉందో, లేదో ఎలా తెలుస్తుంది? ఎవరైతే ఖాళీ దొరికితే ధ్యానంలో కూర్చుంటారో వాళ్ళు ఆత్మని ఇష్టపడినట్టు.

మీరు కళ్ళు మూసుకుని "శ్వాస మీద ధ్యాస" పెడితే కాసేపటికి మీరు ఆత్మతో ఉంటారు. అలా ఆత్మతో ఉండడానికి మీరు ఇష్టపడుతూ ఉంటే మీకు ఆత్మ మీద భక్తి ఉన్నట్టే. అందుచేత మనలో ఇటువంటి లక్షణాలు లేకపోయినా, తక్కువ ఉన్నా వాటిని ఆచరించే ప్రయత్నం చెయ్యాలి. భగవానుడికి ఇష్టులు అవ్వాలి. మీ జన్మను ధన్యం చేసుకోవాలి.

**శ్లో॥ యస్మాన్నోద్విజతే లోకో లోకన్నోద్విజతే చ యః**
**హర్షామర్షభయోద్వేగైః ముక్తో యః స చ మే ప్రియః (భ.గీ.12-15)**

తా: ఎవని వలన లోకములోని జనులు భయపడరో, ఎవడు లోకము వలన భయము పొందడో, ఎవడు సంతోషము, క్రోధము, భయము, మనో వ్యాకులత, మున్నగునవి లేకుండా ఉంటాడో అట్టివాడు నాకు ఇష్టుడు అన్నారు.

ఏవైతే శ్రీకృష్ణుల వారు చెప్పారో అవన్నీ భగవంతుని యొక్క లక్షణాలే. ఆ స్థితికి మీరు చేరుకున్నప్పుడు ఆ రకమైన ప్రవర్తన మీలో కనిపిస్తుంది. అప్పుడు మీరు ఆయనకి ఇష్టులమవుతారు. ఈ రకమైన ప్రవర్తన రావాలి అంటే ఖచ్చితంగా "శ్వాస మీద ధ్యాస" ధ్యానం చేయాలి, సాత్వికమైన శాకాహారం తీసుకోవాలి. ఈ రెండు పనులు చేసిన వారు భగవానుడు ఎలా ఉండాలని చెప్పాడో అలాంటి స్థితి తెచ్చుకోగలుగుతారు.

పత్రి గారు ఒక సందర్భంగా నేను 50 వేల పుస్తకాలు చదివాను, వాటన్నిటిని మిక్సీలో వేస్తే అందులోనుంచి రెండు వాక్యాలు వచ్చాయి. ఆ పుస్తకాల సారం ఏమిటంటే ?

1) శ్వాస మీద ధ్యాస ధ్యానము.

2) సాత్వికమైన శాకాహారం.

ఆయన ఏమన్నారంటే? ఈ రెండు పట్టుకుంటే సమస్త లాభాలు మీరు పొందగలుగుతారు, సమస్త మార్పులు వస్తాయి, సమస్తము ఆచరించగలుగుతారు అన్నారు.

ఈ రెండు తప్ప ఇంకేమి లేవు అన్నారు. మీ జీవితంలో ఏ సమస్య కలిగినా మీరు వాళ్ళనీ, వీళ్ళనీ పరిష్కారం అడగకుండా ఈ రెండు చేయండి చాలు పరిష్కారం అవుతాయి అన్నారు. నేను మొదట్లో తిరిగేటప్పుడు చాలామంది వాళ్ళకుండే సమస్యలు చెప్పేవారు. తెలుసున్న మటుకు అక్కడే వివరించేవాడిని. లేకపోతే దాన్ని నోట్ చేసుకుని ఇంటికి వచ్చిన తర్వాత దాని గురించి బాగా లోతుగా ఆలోచిస్తే చివరికి ఈ రెండే పరిష్కారంగా వచ్చేది.

నేను సమస్యల గురించి నాలుగు పాయింట్లు ఆలోచించేవాడిని.

1) సమస్య

2) ఆ సమస్య వల్ల వచ్చే నష్టాలు

3) ఆ సమస్యకి కారణం

4) ఎప్పుడైతే కారణం తెలిసిందో పరిష్కారం కూడా వెంటనే తెలుస్తుంది. ఈ నాలుగు పాయింట్లు ఆలోచించే వాడిని.

అలాగే శ్రీకృష్ణుల వారు చెప్పినట్టుగా జీవించాలన్నా, మీ ప్రవర్తన అలా ఉండాలన్నా, ఎవరైనా ఈ రెండూ తీవ్రంగా ఆచరిస్తే ఖచ్చితంగా బయట పడతారు.

శ్రీకృష్ణుల వారు 'ఎవని వలన లోకంలోని జనులు భయపడరో!' అన్నారు.

మీరు చూడండి సాధన తీవ్రంగా చేసినప్పుడు సాత్విక గుణంలోకి

వస్తారు. సాత్విక గుణంలో వచ్చిన వాళ్ళు అందరినీ ప్రేమిస్తారు, అందరికీ మంచి చేయాలని చూస్తారు, వీలైనంత అందరికీ సేవలు చేస్తారు. అటువంటి వారిని అందరూ ఇష్టపడతారు. మరి అందరినీ ఇష్టపడేవాడంటే ఎవరు భయపడతారు? భయపడరు.

అందుకే లోకము వలన భయము పొందడో! అన్నారు. చాలామందికి ఎన్నో భయాలు ఉంటాయి, రకరకాల భయాలు ఉంటాయి. డబ్బు ఉన్నా భయమే, డబ్బు లేకపోయినా భయమే, ఎవరికైనా ఏదైనా అయితే భయం. డబ్బు ఉన్నవాడికి ఇన్కమ్ టాక్స్ భయం, బాగా సంపాదిస్తే చివరికి ఆ డబ్బు ఉంటుందో లేదో భయం.

పిల్లల్ని స్కూల్ కి పంపుతారు మళ్లీ వచ్చేదాకా భయం, భర్త ఉద్యోగానికి వెళ్లి లేట్ గా వస్తే భయం. రోజు వచ్చేవాడు దేని దగ్గరికైనా వెళ్ళాడేమో అని భయం, కాఫీ, టీ బాగా అలవాటు ఉన్నవాళ్ళకి పొద్దున్నే పాలు రాకపోతే భయం. ఇంకా కొంతమందికి పని మనిషి అలవాటు ఉంటుంది. ఆ పని మనిషి రాకపోతే వస్తుందో? రాదో? అని భయం.

ఇలా లోకంలో రకరకాల భయాలతో భయం భయంగా జీవిస్తున్నారు. దేనికి భయపడినా, భయపడకపోయినా అందరూ చావుకు భయపడతారు. ఈ భయానికి కారణం మనసు. అందుచేత ఏది ఏమైనా భగవంతునికి ఇష్టులు కావాలి అంటే, ఆయన చెప్పినటువంటి లక్షణాలు మనం సంపాదించుకోవాలి, అంటే ఈ రెండు పాటించవలసిందే.

చాలామంది సాధన బాగానే చేస్తారు కానీ ఆహారం విషయంలో దెబ్బ తింటున్నారు. ఆహారం దగ్గరికి వచ్చేసరికి ఆ నియమాలు పాటించకపోవడం వల్ల మళ్లీ వెనక్కి వెళ్ళిపోతున్నారు, ఆహారం విషయంలో కంట్రోల్ చేసుకోలేరు. చాలామంది ఇంట్లో బాగానే ఉంటారు బయటికి వెళ్ళినప్పుడు పాటించరు. అందుచేత ఆహారం విషయంలో చాలా జాగ్రత్తగా

ఉండాలి. ఇంకొక శ్లోకం చూద్దాం

**శ్లో॥ అనపేక్షః శుచిర్దక్ష ఉదాసీనగతవ్యథః**

**సర్వారంభపరిత్యాగీ యో మద్భక్తః స మే ప్రియః (భ.గీ.12-16)**

తా: కోరికలు లేనివాడు, అంతర్ శుద్ధి కలవాడు, వివేకవంతుడు, దేని యందు ఆసక్తి లేనివాడు, దుఃఖించనివాడు, సమస్త కార్యాలు పరిత్యజించిన వాడు, నా యందు అంటే ఆత్మ యందు భక్తి కలవాడు, ఎవడు కలడో అతడు నాకు ఇష్టుడు అన్నారు.

'కోరికలు లేనివాడు' అన్నారు. శ్రీకృష్ణుల వారు కోరిక ఉండకూడదు అని చాలా సందర్భాల్లో చాలా స్పష్టంగా చెప్పారు. కానీ లోకంలో దేవుడ్ని ఆశ్రయించేది, ఆరాధించేది కోరికల కోసమే. ఆఖరికి ఈ ధ్యాన మార్గంలో వచ్చినవాళ్ళు కూడా ఈ ధ్యానాన్ని కోరికల కోసమే చేస్తున్నారు. మన మాస్టర్లు కూడా సంకల్పాలు పెట్టి మరీ ధ్యానం చేయమంటారు.

కానీ పత్రి గారు స్పష్టంగా "నువ్వు చేయవలసింది చేస్తే, రావలసింది ఆటోమేటిక్ గా వస్తుంది" అన్నారు. మనకి కష్టాలు ఎందుకు వస్తున్నాయి? చేయకూడని పనులు చేయడం వల్ల. ఎందుకు చేశావు? నీ మనసు మలినంగా ఉండడం వల్ల. ఎందుకు మలినంగా ఉంది? "శ్వాస మీద ధ్యాస" ఉంచి ధ్యానం చేయకపోవడం వల్ల, సాత్వికమైన శాకాహారం తీసుకోకపోవడం వల్ల. అందుచేత ఈ రెండు ఆచరిస్తే కష్టాలు ఉండవు, సమస్యలు ఉండవు.

ఇంకా ఏమని చెప్పారంటే? "అంతర్శుద్ధి కలవాడు" అన్నారు. అంతరంలో ఉండేది మనసు, అంటే ఆ మనసు శుద్ధి చేసుకున్నవాడు ఇష్టుడు అన్నారు. అంటే సాత్విక గుణం నుండి శుద్ధ సాత్విక స్థితికి చేరుకోవాలి, ఈ శుద్ధ సాత్విక స్థితిలో ఉన్నవాడిని ఆంజనేయ స్వామితో పోలుస్తారు. మరి ఆంజనేయ స్వామి రాముడికి బంటయ్యాడు, రాముడికి ఇష్టుడయ్యాడు.

అలాగే "వివేకవంతుడు" అన్నారు. "శ్వాస మీద ధ్యాస" ధ్యానము

తీవ్రంగా చేయడం వల్ల, సాత్వికమైన శాకాహారం తీసుకోవడం వల్ల మనసు శుద్ధమై, బుద్ధి వికసించి, వివేకం కలుగుతుంది.

అలాగే "దేని యందూ ఆసక్తి లేనివాడు" అన్నారు. వాడెవరో వాడు తెలుసుకున్నాక, తాను ఆత్మ, తానే ఆ పరబ్రహ్మ, సమస్తమూ తనదే అయినప్పుడు ఇంక దేని మీద ఆసక్తి ఉంటుంది?

అలాగే "దుఃఖించనివాడు" అన్నారు. ఆ స్థితిలో ఉన్నవాడికి దుఃఖం ఉండదు. అలాగే " సమస్త కార్యాలు పరిత్యజించినవాడు" అన్నారు. ఏదైనా కావాలంటే ఏదైనా చేయాలి. ఆ స్థితికి చేరుకున్నవాడు చేయవలసినవి ఏముంటాయి? ఏమీ ఉండవు.

అలాగే "ఆత్మ యందు భక్తి కలవాడు" అన్నారు. ఇది చాలా ముఖ్యం, ఆత్మ మీద శ్రద్ధ, ఆత్మ మీద భక్తి, ఆత్మ మీద ఆసక్తి ఉన్నవాడు ఇష్టుడు అన్నారు.

మేడం కూడా చెప్తూ ఉంటుంది "విషయ విరక్తి, ఆత్మ ఆసక్తి" అని. ఇప్పుడు మీ అందరికీ కూడా ఆత్మ మీద ఆసక్తి ఉండబట్టే ప్రతి నెల ఇలా వచ్చి ఇంత శ్రద్ధగా ధ్యానం చేస్తున్నారు. ఆత్మ స్థితిలో ఇలా గంటలు, గంటలు కూర్చుంటున్నారు. ఇదే విధంగా కొనసాగించినట్లయితే మరి కృష్ణ భగవానుడు చెప్పినట్టు ఒక్కొక్క లక్షణం సంపాదించుకుంటారు, ఎలాంటి వారైనా మారిపోతారు, భగవంతుడికి ఇష్టులు అవుతారు.

# దైవానుగ్రహం

దైవం అంటే భగవంతుడు.  దైవానుగ్రహం పొందాము అనడానికి నిదర్శనం సద్గురువుల, మహాత్ముల సాంగత్యం లభించడమే.

సహజంగా మనకి సినిమాల్లో చూపిస్తుంటారు. దైవం యొక్క అనుగ్రహం అంటే ఆయన ఏదో ప్రత్యక్షమైనట్టు, నీకు వరాలు ఏమైనా ఉంటే కోరుకో అన్నట్టు వీరు కోరుకున్నట్టు, అక్కడ అనుగ్రహం పొందినట్లు భావిస్తూ ఉంటారు. అది ఊరికే మనకి సినిమాలో చూపిస్తారు.

కానీ గుర్తుపెట్టుకోండి ఆ దైవం యొక్క అనుగ్రహం మనం పొందాము అంటే మనకేదో వ్యాపారము, ధనము పెరుగుతుంటే కాదు, అందరూ అదే అనుగ్రహం అనుకుంటారు, అనుకున్నది అవుతూ ఉంటే దైవానుగ్రహం అనుకుంటారు, లేకపోతే తను కోరుకున్నది లభించినా జరిగినా ఆ దైవానుగ్రహం కలిగిందని అనుకుంటారు.

నిజంగా  దైవానుగ్రహం ఎవరికి కలిగింది అంటే? ఎవరికైతే సద్గురువులు లేకపోతే మహాత్ముల సాంగత్యం లభించిందో వాళ్ళు దైవనుగ్రహం పొందినట్లే లెక్క. కారణం అటువంటి సద్గురువులు వారిని సరైన మార్గంలో నడిపిస్తూ ఉంటారు, వారు నడవవలసిన మార్గంలో నడిపిస్తూ ఉంటారు.

వాళ్ళ లోపాలు వాళ్ళకి తెలియపరుస్తూ ఉంటారు, ఎత్తి చూపిస్తూ ఉంటారు. ప్రతి విషయంలో వాళ్ళు ఎంతో సరిచేస్తూ ఉంటారు.

మాట దగ్గర నుంచి, చేతల దగ్గర నుంచి, పనుల దగ్గర నుంచి కూడా సరిచేసే ప్రయత్నమే వాళ్ళు చేస్తారు. వారు ఊరికే అధికంగా ఉపన్యాసాలు ఏమి ఇవ్వరు.

కానీ వారి పరిచయ భాగ్యం వల్ల, వారితో సాంగత్యం వల్ల, వారితో గడపడం వల్ల మీ లోపాలు మీరు తేలిగ్గా సరిచేసుకుంటూ ఉంటారు. అప్పుడు నిజంగా కూడా మీ అందరికీ దైవానుగ్రహం లభించినట్టే లెక్క.

కారణం పత్రి గారి యొక్క  సాంగత్యం మనం పొందగలిగాం. నిజంగా మనమంతా ఎంతో అదృష్టవంతులం ఇటువంటి అనుగ్రహం పొందాలి

అంటే ఖచ్చితంగా 300, 350 జన్మలు దాటాలి.

చాలామంది అన్నీ కలిసి వస్తున్నాయండి, అన్నీ బాగా జరుగు తున్నాయి అంటారు. ఇన్నీ జరుగుతున్నాయి అంటే అక్కడ దైవానుగ్రహం కాదు అది గతంలో మీరు చేసుకున్న దాని ఫలితం అనుభవిస్తున్నారు.

గతంలో మంచి చేసుకున్నారు దాని ఫలితం ఇప్పుడు లాభాలు ఉండొచ్చు, భోగం ఉండొచ్చు. అలా అన్ని కలిసొస్తూ ఉంటే ఆ దేవుని యొక్క దయ కలిగింది, ఆ దైవనుగ్రహం వల్ల నేను ఈ స్థాయిలో ఉన్నాను అని భావిస్తూ ఉంటారు. కానీ దైవం యొక్క అనుగ్రహం ఉంటే అందరి జీవితాలు బాగుంటాయి, అందరికీ బాగుంటాయి ఒకడికి బాగుండి, ఒకడికి బాగోక అలా ఉండదు.

పత్రిగారిని గమనిస్తే భోజనం చేసే దగ్గర నుంచి సరి చేస్తారు. ఆయన ఈ చిన్న విషయమే మీకు అర్థం కాకపోతే ఇంక పెద్ద పెద్ద విషయాలు ఏం అర్థం అవుతాయి అంటారు.

మనం పత్రిగారు పరిచయం అయినప్పుడు ఎవరైనా సరే ఊరికే సరదాగా అందరినీ నవ్విస్తున్నట్టు, ఊరికే సరదాగా గడుపుతున్నట్టు ఉంటారు. ఆయన మాట్లాడే ప్రతి మాటలోనూ ఏదో ఒక సందేశం ఉంటుంది. అందుచేత అటువంటి వాళ్ళు పరిచయమైనప్పుడు వారి సాంగత్యంలో ఎంతమంది అయినా ఉండొచ్చు. మనం మటుకు అక్కడే ఉండి ఆయన మాట్లాడే మాటలు జాగ్రత్తగా గమనిస్తూ ఉండాలి. ఆయన మాటల్లో ఎవరినో ఉద్దేశించి మాట్లాడుతున్నట్టుగా ఉంటుంది. కాని అది మనల్ని కూడా ఉద్దేశించే ఆ మాటలు ఉంటాయని తెలుసుకోవాలి. వాళ్ళని ఉద్దేశించి చెప్పడం కాదు దాంట్లో మనకు కూడా సందేశం ఉంటుంది. అందుచేత అది మనం అర్థం చేసుకుని, దాన్ని గ్రహించి ఆచరణలో పెడితే జీవితంలో లాభం పొందుతాము.

ఇలా నా జీవితంలో ఎన్నో సరి చేసుకున్నాను, నేను ఎన్నో తెలుసు కున్నాను. ఆయన నన్ను ఎంతో మార్చారు. మొదట్లో తెలియక ఏదో మాట్లాడాలి అనుకుంటూ మాట్లాడేవాడిని, తర్వాత తర్వాత అర్థమైంది. మొదట్లో అంత జ్ఞానం లేదు తర్వాత మాటలు తగ్గించి వినయడం పెంచాను.

ఆ 'సద్గురువుల పని సరైన మార్గంలో సరైన విధంగా మార్పు తీసుకొచ్చి సరైన విధంగా తీర్చి దిద్దుతారు'. ఆయన పని ఎవరెవరికైతే అర్హత ఉంటుందో దానికి తగ్గట్టుగా వాళ్ళకి సందేశాలు ఇస్తూ వుంటారు. ఎవరి స్థాయికి తగ్గట్టు వాళ్ళకి ఆయన సందేశం ఇస్తూ వుంటారు.

సద్గురువులు మనకు లభించడం వల్ల మనం ఎన్నో తెలుసుకుంటాం, వాళ్ళ ద్వారా సత్యం గురించి తెలుసుకుంటాం, ఆత్మ గురించి తెలుసుకుంటాం, ఆత్మజ్ఞానం తెలుసుకుంటాం, ఆత్మోన్నతికి కావలసినటువంటివన్నీ తెలుసు కుంటాం. నేను దేహం కాదు అన్నది బాగా తెలుసుకుంటాం, దైవం వేరే లేడు, నేనే ఆ దైవాన్ని అన్న విషయం కూడా తెలుసుకుంటాం. నేను సామాన్యుడిని కాదు నేను చాలా గొప్పవాడినే అన్నది తెలుసుకుంటాం.

అలా మనలో ఎన్నో రకాలైనటువంటి అపోహలు తొలగించు కుంటాం. ఆ దైవం గురించి మనం తెలుసుకోవడం దానిని తెలుసుకునే స్థాయికి మనం ఎదగడం నిజంగా అది దైవానుగ్రహం కాకపోతే ఇంకేంటి! అందుచేత ఎవరైతే ఈ మార్గంలోకి వచ్చారో వాళ్ళందరూ దైవానుగ్రహం పొందినట్టే.

అందులోనూ నేను ఇంకా ఖచ్చితంగా కూడా చెప్తున్నాను ఇలా మనం భీమవరం మూడు రోజుల క్లాసులకు ఎవరైతే వస్తున్నారో వాళ్ళందరూ కూడా ఖచ్చితంగా దైవానుగ్రహం పొందినవారు.

అటువంటి గురువులను మనం ఆశ్రయించడం వల్ల తప్పు దారిలో పడం. మీరు చూడండి మీకు దారి తెలియదు, ప్రయాణం చేస్తున్నారు ఎక్కడికక్కడ మీకు రోడ్లు అటు ఇటు ఉంటాయి. జంక్షన్‌లో ఎటు వెళ్ళాలో అర్థం కాదు. అర్థం కానప్పుడు ఏదో ఒకరూట్‌లో వెళ్ళిపోయారు అనుకోండి మళ్ళా వెనక్కి రావాలంటే ఎంత సమయం వృధా అవుతుంది. ఎంత ఖర్చు అవుతుంది? కానీ సద్గురువు మనల్ని సరియైన దారిలో నడిపిస్తారు, అందుకే అటువంటి సద్గురువుల సాంగత్యం లభించడం దైవానుగ్రహమే కానీ ఇంకొకటి కాదు.

# ఆత్మ సాక్షాత్కారం పొందితే?

**"అమృతం తాగి తృప్తి పొందిన వానికి ఫలరసాలు కానీ నీటితో కానీ ప్రయోజనం లేదు. అలాగే పరమాత్మ సాక్షాత్కారం అంటే ఆత్మ సాక్షాత్కారం పొందిన వానికి, శాస్త్రాలు కానీ, సత్కర్మలు కానీ, ధనంతో కానీ, ప్రాపంచికమైన భోగాలతో కానీ ప్రయోజనం లేదు".**

దీని గురించి కొంచెం వివరంగా తెలుసుకుందాం.

అమృతం త్రాగిన వారికి అంటే అమృతం ఎంత గొప్పదో తెలుసు. అమృతం త్రాగినవాడు అమరుడు అవుతాడు, అంటే చావు పుట్టుక లేనివాడు అవుతాడు, అంత గొప్పది అమృతం.

అటువంటి అమృతం పొందడానికి మనకి పురాణాల్లో ఒక కథ ఉంది. దేవతలు రాక్షసులు పాల సముద్రాన్ని మథించారు. మథిస్తే మొట్టమొదట హాలహాలము తర్వాత కామధేనువు, కల్పవృక్షం,లక్ష్మీదేవి ఇలాగ ఎన్నో వస్తే చివరికి అమృతం వచ్చింది. అంటే అటువంటి అమృతం కోసం దేవతలు, రాక్షసులు ఎంత కష్టపడ్డారో మనకు అర్థంవుతుంది. అంత గొప్పది కాబట్టి అంత కష్టపడ్డారు.

అందుచేత అటువంటి అమృతాన్ని తాగిన వాడికి సాధారణంగా లోకంలో వున్న ఫల రసాలు, నీరు ఏమీ ప్రయోజనం లేదు. అంత గొప్పది అమృతం, అమృతంతో దేన్ని పోల్చలేము. అలాగే ఆత్మ సాక్షాత్కారం పొందిన వారికి, 'ఆ భగవత్ సాక్షాత్కారం పొందిన వారి యొక్క ఆనందానుభూతి వర్ణించలేము. అటువంటి అనుభూతి ఈ ప్రపంచంలో ఉన్న వేటితోటి పోల్చలేము. అంత గొప్పగా ఉంటుంది, అంత గొప్ప ఆనందాన్ని ఇస్తుంది. దానిని ఎవరూ వర్ణించలేరు, చెప్పలేరు.

ఆ అనుభూతి అలాంటిది. చూడండి మామిడి పండు చాలా బాగుంది అని చెప్తారు, చెప్పినంత మాత్రం దాని మాధుర్యం తెలియదు. ఆ మామిడి

పండు తిని అనుభూతి చెందితేనే అది ఏంటో అర్థమవుతుంది. అలాగే పరమాత్మ సాక్షాత్కారం, ఆత్మ సాక్షాత్కారం,ఆ ఆత్మ అనుభూతి పొందిన వారికి పొందే ఆనందం,ఆ బ్రహ్మానందం వర్ణించలేరు,వివరించలేరు.

మానవునికి ఉన్న ఇంద్రియాలు సరిపోవు. దాన్ని అనుభవించ వలసిందే తప్ప. అటువంటి అనుభూతి పొందిన వాడికి శాస్త్రాలతో, సత్కర్మలతో, ధనంతో పనిలేదు.

చాలామంది శాస్త్రాలు అన్నీ పఠిస్తూ ఉంటారు. ఎన్నో నేర్చుకుంటూ ఉంటారు, ఎన్నో తెలుసుకుంటూ ఉంటారు, ఎన్నో చదువుతూ ఉంటారు. అవే గొప్పవి అనుకుంటూ ఉంటారు, చదువుతూ గొప్పవాడిని అయిపోయాను అనుకుంటారు.

మరి సత్కర్మలు కానీ అన్నారు, చాలామంది పెద్దలు చెప్తూ ఉంటారు. సత్కర్మలు, పుణ్యకర్మలు చేస్తే నీకు దానివల్ల పుణ్యం వస్తుంది,భోగం వస్తుంది. నువ్వు పుణ్యలోకాలకి వెళ్తావు అని చెప్తూ ఉంటారు. అటువంటి సత్కర్మలు కూడా పనిచేయవు.

అలాగే ధనంతో కానీ అన్నారు. ఇక్కడ ప్రతి ఒక్కరిని మనం చూస్తున్నాం. లోకంలో 99% భూమ్మీద ధనం సంపాదించడానికి ఎక్కువ ప్రాముఖ్యం ఇస్తారు. ఎందుచేత అంటే అదే గొప్పది అనుకుంటారు. దాంతో ఎన్నో అనుభవించొచ్చు, ఎన్నో సాధించొచ్చు, ఎన్నో చేయొచ్చు అంటారు. ఈ జగత్తంతా ధనం మీద ఆధారపడి ఉంది.

"ధనం మూలం ఇదం జగత్" అని, అదే గొప్పది అని భావిస్తారు. అటువంటి ధనంతో కానీ, భోగాలతో కానీ పోల్చలేరు.

మానవులకు ఐదు రకాల ఇంద్రియాలు ఇవ్వబడ్డాయి కళ్ళు, చెవులు, ముక్కు,నోరు, చర్మం. వీటితో ఎన్నో భోగాలు అనుభవిస్తూ ఎంతో సంతోషాన్ని పొందుతున్నాడు. అదే గొప్ప అనుకుంటున్నాడు. నిజంగా ఏ దుఃఖం లేని వాడికి సంతోషం అనుభవిస్తున్న నాకంటే అదృష్టవంతుడు ఎవరూ లేరు

అనుకుంటాడు.

ఏ సమస్య, ఏ బాధ లేకుండా ధనం బాగా ఉండి మంచి ఇల్లు కట్టుకున్నా, మంచి డెకరేషన్ చేసినా, అన్ని రకాలు ఉన్నా, పనివాళ్ళు ఉన్నా, పరిచారకులు ఉన్నా, ఏ లోటు లేకపోయినా, వాడు ఏమనుకుంటాడంటే? అబ్బా ఎంత గొప్ప హోదా నాది అనుకుంటాడు.

అలాగే కొంతమందికి పదవులు వస్తాయి. కొంతమందికి గొప్ప ఉద్యోగం వస్తుంది, మంచి హోదా ఉన్న ఉద్యోగం చూసుకుని అవి అనుభవిస్తూ నా అదృష్టం అనుకుంటూ ఉంటారు. నేను ఇలాంటి స్థితిలో ఉన్నాను అనుకుంటారు. అలాంటివి  కూడా ఏమి ప్రయోజనం ఉండదు.

ఎవరి ముందు ప్రయోజనం ఉండదు?  పరమాత్మ సాక్షాత్కారం, భగవత్ సాక్షాత్కారం, ఆత్మ సాక్షాత్కారం, ఆత్మానుభవం ముందు ఇవన్నీ బలాదూర్ అన్నది ఎప్పుడు తెలుస్తుంది?అది పొందిన వారికి తెలుస్తుంది.

అందుకే మీరు చూడండి ఈ భోగాలు అనుభవిస్తున్న వాళ్ళకి మీరు వెళ్ళి ధ్యానం చెప్పండి ఎక్కదు. ఏముంది ధ్యానంలో ఖాళీగా కూర్చోవడమే కదా? ఏదైనా సంపాదించుకుంటే లాభం ఉంటుంది గానీ ఏ సంపాదన లేకుండా అలా ఉంటే ఏమిటి లాభం అంటారు.

అలాగే ధనం లేని వాళ్ళు కూడా బాధపడుతూ ఉంటారు. అందరికీ డబ్బు ఉంది ఎంతో బాగున్నారు, సుఖ సంతోషాలతో వున్నారు, నాకే ధనం లేదు. ఈ ధ్యానం చేసి ఏమిటి ప్రయోజనం అని భావిస్తూ ఉంటారు.

ఆ ధనం సంపాదించడానికి తాపత్రయపడతారు, తాపత్రయ పడడమే కాదు. తప్పులు, పాపాలు కూడా చేస్తారు. ఆ ధనమే,ఆ భోగాలే గొప్పవని అనుకుంటూ ధనం ఉన్నవాళ్ళంతా గొప్పవాళ్ళని భావిస్తూ ఉంటారు. కానీ ఇలాంటివి ఎన్ని ఉన్నా, ఎన్ని భోగాలు వున్నా, ఎన్ని పుణ్యకర్మాలు చేసినా, ఆ శాస్త్రాలు చదివి ఎంత పాండిత్యం పొందినా ఇటువంటివన్నీ ఏమి ప్రయోజనం లేవని ఎప్పుడు తెలుస్తుంది అంటే? ఆత్మ సాక్షాత్కారం పొందినప్పుడు.

ఇది ఎవరికి అర్థం అవుతుంది? ఎవరైతే ఈ ధ్యానంలో పరాకాష్టకు చేరుకుంటారో వారికి తెలుస్తుంది.

"శ్వాస మీద ధ్యాస" పెట్టినప్పుడు ఆలోచనలన్నీ తగ్గిపోతూ ఉంటాయి. తగ్గి, తగ్గి మనసు ఖాళీ అయిపోతుంది. ఎప్పుడైతే ఖాళీ అవుతుందో మీరు గంట, రెండు గంటలు కాదు,మూడు గంటలు సునాయాసంగా కూర్చుంటారు. అది నిశ్చల స్థితి.

అలాగే ఇంకా ఇంకా మీరు ధ్యానం చేస్తూ ఉంటే మలినంగా ఉన్న మీ మనసు నిర్మలం అవుతుంది.ఇంకా మీరు కొనసాగిస్తూ ఉంటే ఆ నిర్మలమైన మనసు చివరికి శూన్యం అవుతుంది. శూన్యం అయినప్పుడు ఆ శూన్యంలోంచి ఇంకా పరిశూన్యము, మహా పరిశూన్య స్థితికి చేరుకున్నప్పుడు మీరు అంతరంలో ఉన్నటువంటి ఆత్మను అనుభూతి చెందుతారు.

దాన్నే ఆత్మ సాక్షాత్కారం అంటారు. పరమాత్మ సాక్షాత్కారం అంటారు. కానీ ఆ దైవాన్ని చూడడం ఎవరికీ సాధ్యం కాదు. చాలామంది చూడడం ఎలాగా అంటారు. సూక్ష్మాతి సూక్ష్మమైన భగవంతుని అనుభూతి చెందగలరుగానీ చూడడమన్నది సాధ్యం కాదు.

ఆ అనుభూతి పొందినప్పుడు ఆ ఆనందాన్ని వారు వర్ణించలేరు. అలా ఆనందంలో ఓలలాడిపోతూ ఉంటారు.అటువంటి స్థితిలో వాళ్ళకి రోజులు కాదు, నెలలు కాదు, సంవత్సరాలు కూడా అలా గడిచిపోతూ ఉంటాయి.

మామూలు ప్రపంచంలో ఉన్నవాడికి ఒక రోజు గడవాలి అంటే అందులో దుఃఖంలో ఉన్నవాడు గంట గడవాలంటే చాలా కష్టంగా ఉంటుంది. కానీ ఆనందానుభూతిని పొందుతున్న వాడికి సంవత్సరాలు కూడా ఇట్టే గడిచిపోతాయి. ఆ స్థితినే "సమాధి స్థితి" అంటారు. ఆలోచనలు లేని స్థితి సమాధి స్థితి కాదు. ఆ పరమాత్మను అనుభూతి చెందిన స్థితే సమాధి స్థితి.

రమణ మహర్షి జీవితం మనం చూస్తే ధ్యానం చేస్తూ ఉంటే ఆ స్థితికి వెళ్ళిపోయాడు. అలా ఉండిపోయి ఎన్నాళ్ళు ఉన్నాడో ఆయనకే తెలియదు.

చీమలు కూడా పట్టినా, అవి పట్టి ఒళ్ళంతా కొరికేస్తున్నా, ఆయనకు ఏం తెలియలేదు. అంతేకాదు ఆనందం అంత గొప్పది. అలా వున్న రమణ మహర్షి వారిని ఎవరో చూసి అన్నీ దులిపి ఆయన్ను బయటకి తీసుకురావడం చాలా కష్టమైందట. ఇప్పుడు మనం చేసే ఈ ధ్యానం యొక్క పరాకాష్ట ఇదే! లక్ష్యం ఇదే!.

ఏదో రోగాలు తగ్గడం, ఏవో అనుభవాలు పొందడం, ఏదో సమస్యలు పోవడం, కోరికలు తీర్చుకోవడం ఇవి కాదు. ఈ స్థితి సాధించడానికి ప్రయత్నం చేయాలి. ధ్యానంలో గంటలు గంటలు కూర్చున్నా కూర్చున్నట్టు ఉండకూడదు. ఇది అర్థం అవ్వాలంటే ఒక ఎగ్జాంపుల్ మీరు తీసుకోవచ్చు.

మనమంతా మానవులం. మానవులమైన మనకి మూడు అవస్థలు ఉన్నాయి. జాగృధావస్థ, స్వప్నావస్థ, సుషుప్తి అవస్థ.

జాగృధావస్థ అంటే? ఇప్పుడు మనం ఉన్నది. జాగృధావస్థలో శరీరము, ఇంద్రియాలు పనిచేస్తూ ఉంటాయి.

అలాగే రాత్రి అయిన తర్వాత మనం నిద్రలోకి వెళ్ళిపోతాం. నిద్రలో ఈ శరీరము ఇంద్రియాలు పనిచేయవు. కానీ మనసు పనిచేస్తూ ఉంటుంది, ఈ మనసు ఏం చేస్తూ ఉంటుందంటే ఈ జాగృదావస్థలో జరిగినటువంటి సంఘటనలు, విషయాలు అవన్నిటినీ కల్పనలు చేస్తూ ఉంటుంది. అలా మనసు చేసే కల్పనలనే కలలు అంటారు.కలలు కనే అవస్థనే స్వప్నావస్థ అంటారు.

కాసేపటికి ఆ కలలు కూడా అగిపోతాయి. ఒక్కోసారి మీరు చూడండి చాలామంది రాత్రి ఎనిమిదింటికో, తొమ్మిదింటికో పడుకుంటారు. పొద్దున్న ఏడైనా, ఎనిమిదైనా లెగరు. అప్పుడు ఇంట్లో వారు లేపి ఏంటి ఆ మొద్దు నిద్ర అంటే గమ్మున లేచి అదేంటి అప్పుడే తెల్లారిపోయిందా? అంటారు. వాళ్ళకి ఇన్ని గంటలు ఎలా గడిచిపోయాయి అని ఆశ్చర్యంగా ఉంటుంది. ఎందుకు గడిచిపోయాయి అంటే?

అక్కడ శరీరము లేదు, మనసు లేదు. వాళ్ళు ఆత్మ స్థితిలో ఆత్మతో

ఉన్నారు. ఆత్మ అంటే ఆనందమే.అటువంటి శరీరము మనసు లేకుండా ఉన్న స్థితినే సుషుప్తి అవస్థ అంటారు. అందుకే అన్ని గంటలు గడిచిపోయింది.

అదే అవస్థని మనం ఇక్కడ ప్రయత్నం ద్వారా తెచ్చుకోవడమే ధ్యానం. ధ్యానం అంటే ఆ సుషుప్తి అవస్థని మన ప్రయత్నం ద్వారా సంపాదించుకోవడం. అందుకే ధ్యానంలో ఎరుక ఉంటుంది, సంతృప్తిలో ఎరుక ఉండదు.

ఈ ఆత్మానుభూతి,ఆత్మ సాక్షాత్కారం ఎంత గొప్పది అంటే ఇంకో ఉదాహరణ చెప్తాను. ఓషో మహాశయుడు చెప్పిన విషయం; 1) సంభోగ ఆనందం, 2) సమాధి ఆనందం.

సంభోగ ఆనందం అంటే? స్త్రీ, పురుషులు సంభోగించడం వల్ల ఆ ఆనందాన్ని పొందుతారు. ఆ సంభోగ సమయం నిమిషం ఉంటుంది.ఆ ఆనందం కోసం మరి వాళ్ళిద్దరూ రోజూ ఎంత కష్టపడతారో చూడండి. కానీ అది ఒక నిమిషమే.

మరి ఎవరైతే ఈ ధ్యానంలో సమాధి స్థితికి చేరుకుంటారో అది శాశ్వతంగా ఉంటుంది. ఒక్క నిమిషం కోసమే ఇన్ని కష్టాలు పడుతున్నారే ఇన్ని తప్పులు, పాపాలు చేస్తున్నారే ఇన్ని పాట్లు పడుతున్నారే! మీరు కొంచెం ధ్యానం బాగా చేస్తే ఆ స్థితికి చేరుకుంటే ఆ ఆనందం శాశ్వతంగా పొందుతారు. ఇంక దాని ముందు అన్నీ బలాదూరే.

ఇప్పుడు మానవుడు పొందే అన్ని రకాల ఆనందం కంటే సంభోగ ఆనందం చాలా గొప్పది అని చెప్తారు. అందుకే మీరు చూడండి భార్యకు దూరమైన వాళ్ళకి ఏమనిపిస్తుంది అంటే వాడికి ఇంకేమి నచ్చవు, ఏది ఎక్కదు. ఎన్ని ఉన్నా వాడికి అన్నీ దండగే. ఎన్ని ఉన్నా వారి పొందు పొందినప్పుడే వాళ్లకు అసలైన తృప్తి. కానీ అది ఒక నిమిషమే. కానీ సమాధి స్థితికి చేరుకున్నప్పుడు పొందే ఆనందం శాశ్వతం.

పూర్వకాలంలో నిర్మించినటువంటి ఆలయాల మీద బూతు బొమ్మలు ఎన్నో ఉంటాయి. చాలా చాలా ఆలయాల్లో చాలామంది అవి చూసి ఎందుకు

ఇటువంటి భంగిమలు ఇలాంటివి ఇంత పవిత్రమైన గుడి మీద ఇలా గీశారు.ఎవరు ఈ పనులు చేసినోళ్ళు అని అనుకుంటారు.

అలా చేయడంలో చాలా గొప్ప అంతరార్థం ఉంది.ఆ పెద్దలు ఊరికే తెలివితక్కువగా ఏం చేయలేదు.

కారణం ఏమిటంటే? ఇప్పుడు ప్రపంచంలో అందరూ ఈ భోగాలలో మునిగిపోయారు ఈ సంభోగానందంలో మునిగిపోయి ఇదే గొప్పది అనేటువంటి భ్రాంతిలో ఉన్నారు. కానీ వాళ్ళు లోపలికి వెళ్తే ఆ 'ఆత్మను దర్శిస్తే ఆత్మ సాక్షాత్కారం పొందితే సంభోగ ఆనందాన్ని మించిన ఆనందం వాళ్ళు పొందగలుగుతారు' అన్న విషయం వాళ్ళకి తెలియదు.

అందుకే ఆ గుడి బయట ఉండేటువంటి ఆ బొమ్మల అర్థం నాయనా వీటితోటి తృప్తి పడకు, నువ్వు ఆ గుడి లోపలికి వెళ్తే ఆ భగవంతునే పొందగలుగుతావు. ఈ ఆనందం కంటే అది ఇంకా ఎంతో గొప్పది. అందుచేత దానితో ఆగిపోకు, లోపలికి వెళ్ళు దర్శనం చేసుకో, ఆ సాక్షాత్కారం పొందు అని చెప్పి చెప్పడానికే, ఈ బూతుబొమ్మలు.

అలాగే ఈ ధ్యానాన్ని మీ భౌతికమైన కోరికలు,భౌతికమైన సమస్యలు వీటి కోసం చేయకుండా లోపలికి వెళ్లి ఆనందం పొందే ప్రయత్నం చేయండి.

# "హంసకు మానస సరోవరం" లభిస్తే చిన్న చిన్న చెరువుల వైపు ఎందుకు చూస్తుంది?

అలాగే మానవునకు ' ఈశ్వరుడు' (ఆత్మ) లభిస్తే మిగతా వాటి వైపు ఎందుకు చూస్తాడు? ఆ మత్తులోనే ఉంటాడు.

"హంస"కి మానస సరోవరం లాంటి ' సరోవరం' లభిస్తే దానికి 'చెరువులు' ఎందుకు?

మరి 'చెరువులు' ఎక్కడ? 'మానస సరోవరం' ఎక్కడ! 'మానస సరోవరంలో' ఉన్న నీళ్లు మన ఫిల్టర్ వాటర్ కి కూడా సరిపోదు.

అక్కడ చూస్తే కనుక నీరు కనిపించదు, 'అడుగే' కనిపిస్తుంది. "మానస సరోవరంలో నీళ్లు అంత స్వచ్ఛంగా ఉంటాయి".

'హంసకి' కావాల్సిన ముత్యాలాంటివన్నీ అక్కడే దొరుకుతాయి. అందుచేత ' హంసకి' మానస సరోవరం లభిస్తే చిన్న చిన్న చెరువుల వంక చూడదు.

మానవుడికి ఈశ్వరుడు అంటే 'భగవంతుడు'. అంటే 'ఆత్మ 'లభిస్తే ఇంక ఈ ప్రపంచంలో దేని వంక చూస్తాడు? ఆ మత్తులోనే ఉంటాడు, బయటకి రాడు. దీనినే 'సమాధి స్థితి' అంటారు. "సమాధి స్థితి అంటే భగవంతుడిని పొందిన స్థితి."

"భగవంతుడి యొక్క స్వరూపం ఆనందం". మీరు 'ఆనందం' అన్నమాట విన్నారు, కానీ! ఆ 'ఆనందాన్ని' ఎప్పుడూ అనుభూతి చెంది ఉండరు.

మానవులు అనుభవించగలిగినవి మూడు ఉన్నాయి.

1) సుఖము, 2) సంతోషము 3) ఆనందము.

"మానవులు సుఖసంతోషాలు రెండు పొందగలరు". వాటితోటే ' తృప్తి' చెందుతున్నారు. కానీ "ఆనందం" పొందరు, పొందలేరు కూడా! కానీ, దాని కోసం ప్రయత్నిస్తే... పొందవచ్చు.

"సుఖము శరీరానికి సంబంధించినది, సంతోషము మనస్సుకి సంబంధించినది, ఆనందం ఆత్మకు సంబంధించినది".

మానవులకు ఐదు రకాల 'జ్ఞానేంద్రియాలు' ఉన్నాయి. 1) కళ్ళు, 2) చెవులు, 3) ముక్కు, 4) చర్మం, 5) నాలుక. ఈ 'జ్ఞానేంద్రియాల' ద్వారా మనస్సుకి ' తృప్తి' కలిగితే దానిని "సుఖము"అంటారు. ఉదా: మీరు భోజనం చాలా రుచిగా ఉంది అని ఎక్కువగా కడుపునిండా తినేశారు అప్పుడు మీరు "ఎంత సుఖంగా ఉంది" అంటారు.

అలాగే మంచి సినిమా చూడటం కళ్ళకి సుఖం, మంచి సంగీతం చెవులకి సుఖం, మంచి సువాసనలు ముక్కుకి సుఖం, చల్లటి ఏసీ గాలి చర్మానికి సుఖం. ఇలాంటి ' సుఖాలు' ఎన్నో పొందాలని మానవుడు డబ్బు సంపాదించి, ఇవన్నీ ఏర్పాటు చేసుకుంటున్నాడు. "రాత్రి పగలు" కష్టపడి డబ్బు సంపాదిస్తారు. ఇల్లు కడతారు, డెకరేషన్లు చేస్తారు, రూమ్ అంతా క్లాస్ గా తయారు చేస్తారు, ఏసీ పెడతారు, లావు పరుపుతో బెడ్ తయారు చేసుకుంటారు, లోపల అన్ని సౌకర్యాలు పెట్టుకుంటారు, టీవీ ఆన్ చేసి, రిమోట్ చేతిలో పట్టుకొని అబ్బా ఏం "సుఖం" అంటారు. ఇలాంటి 'సుఖం' కోసమే కదా! తిప్పలు పడుతున్నారు....

'సుఖం' ఉంటే చాలు అనుకుంటారు కానీ! ఎంత 'సుఖం' ఉన్నా ఏదైనా "విచారం"కలిగితే? 'సుఖం' ఉన్నా లేనట్టే లెక్క! అన్నీ వేసుకుని పడుకున్నా, మైగ్రేన్ తలనొప్పి ఉన్న వాడికి నిద్ర పట్టి చావదే! అప్పుడు వాడు ఇన్ని ఉంటే మట్టుకు ఉపయోగం ఏమిటి? ఈ తలనొప్పి లేకుంటే! బాగుండేది అనుకుంటాడు.

వాడికి చెట్టు కింద హాయిగా నిద్రపోయే వాడిని! చూస్తే "నాకంటే వాడే అదృష్టవంతుడు" అనిపిస్తుంది. ఒంట్లో షుగర్ ఉన్నవాడు, ఇంట్లో స్వీట్స్ ఉన్నా తినలేడు. 'దీని అర్థం ఉన్నా కానీ సుఖపడలేదు'. మానవుడికి ఎన్నో,'కోరికలు' ఉంటాయి. 'కోరికలు' దేనికి సంబంధించినవి అంటే? "కోరికలు మనస్సుకి సంబంధించినవి". పెళ్లి చేస్తే 'సంతోషం', ఇల్లు కడితే

'సంతోషం', వగైరా వగైరా.

"సంతోషము తాత్కాలికమే, సుఖము తాత్కాలికమే". ఉదా: ఒక పిల్లవాడు ఫస్ట్ క్లాస్ లో పాస్ అయ్యాడు. ఆ సంతోషంలో ఎగిరి గంతేసి, స్వీట్లు పంచి పెట్టి, "చాలా సంతోషంగా ఉంది" అని చెప్తాడు. కానీ తర్వాత వాడు అప్లై చేసిన కాలేజ్ లో సీట్ రాకపోతే ఆ 'సంతోషం' ఆవిరైపోతుంది.

''సుఖము, సంతోషము'' రెండు 'శరీరానికి', 'మనస్సుకి' సంబంధించినవి. "ఆనందం మాత్రమే ఆత్మకు సంబంధించినది". మానవుడికి "సుఖ సంతోషాలు" చాలా ఉన్నాయి. కానీ ఒక్క సందర్భంలో మాత్రమే మానవుడు ' ఆనందం' పొందగలుగుతాడు. ఆ "ఆనందం"అనిర్వచనమైనది (నోటితో చెప్పలేరు). అది అనుభవించాల్సిందే తప్ప... చెప్పే సాధ్యం కానంత గొప్పది.

అది స్త్రీ, పురుషుడు సంభోగించినప్పుడు పొందుతారు, కానీ ఆ 'ఆనందం' క్షణకాలం మాత్రమే ఉంటుంది, 'శాశ్వతంగా' ఉండదు. తర్వాత అంతా మామూలే!

మానవుడు ఎటు వెతికినా, ఏది వెతికినా, ఎందులో వెతికినా, ఏదీ 'తృప్తిని' ఇవ్వదు. సైకిల్ ఉన్నవాడు బైక్ కావాలంటాడు, బైక్ ఉన్నవాడు కారు కావాలంటాడు, కారు ఉన్నవాడు పెద్ద కారు కావాలంటాడు, పెద్ద కారు ఉన్నవాడు, తలోఒక కారు కావాలంటాడు. ఇల్లు కావాలి అంటారు, మేడ కావాలంటారు, బంగ్లా కావాలంటారు, ఇలా ఎన్ని పొందినా... సంతృప్తి ఉండదు.

'హంసకి' ఎన్ని చెరువులు తిరిగిన 'సంతృప్తి' ఉండదు. కానీ దానికి "మానస సరోవరం" దొరికితే 'సంతృప్తి'. అప్పుడు 'హంస' అక్కడి నుంచి కదలదు, దేని వంక చూడదు. హంసలాగే మానవుడు కూడా ఎన్ని రకాల "సుఖాలు, సంతోషాలు, ఆనందాలు" పొందినా కూడా ' సంతృప్తి' ఉండదు.

మానవుడికి కనుక ఆ 'భగవంతుడు' లభించినట్లయితే, పొందినట్లయితే.... ఆ "ఆనందం అంతులేనిది, అనిర్వచనమైనది"!

"రమణ మహర్షి" గారు అదే 'ఆనందాన్ని' పొందారు. 'అరుణచలం' లోని శివాలయం కింద రమణ మహర్షి కూర్చున్నారు, మెల్లిగా "సమాధి స్థితిలోకి" వెళ్లిపోయారు.

ఎందుకంటే? భగవంతుడితో ఉన్నప్పుడు, ' ఆనందాన్ని' అనుభూతి చెందుతున్నప్పుడు... ఇంక ఏమీ అక్కరలేదు. జీవితంలో ఎన్ని పొందిన ఈ 'ఆనందనికి' అవి ఎమి పనికిరావు .

"రమణ మహర్షి" సమాధి స్థితిలో ఉన్నప్పుడు ఆయన శరీరానికి 'చదలు' కూడా పట్టాయి. కానీ ఆయన 'ఆనందంలో ' ఉండటం వల్ల... ఇవి ఏమీ ఆయనకి కనిపించలేదు, నొప్పి అనిపించలేదు.

తర్వాత ఎప్పుడో ఎవరో చూసి ఏంటి? ఈయన ఇలా ఉండి పోయాడు, అని వాటిని దులిపి ఆయన్ని మామూలు స్థితికి తీసుకురావడానికి చాలా కష్టపడ్డారట!

ఆయన అసలైన ' ఆనందాన్ని' అనుభవించారు. ఇంకేం కావాలి? సూటు, బూటు, ఏసి, బిల్డింగ్, కారు లేవు అయినా... అసలైన ' ఆనందాన్ని' పొందారు.

మీరంతా ఎన్నో జన్మల నుంచి వస్తున్నారు, ఇంకా అన్వేషిస్తున్నారు. ఎందుకంటే మీకు అసలైన ' ఆనందం' లభించలేదు, కానీ ఆ 'ఆనందాన్ని' రుచి చూస్తే వదలలేరు. "ధ్యానస్థితిలో" ఉన్నవారికి ఏమీ అవసరం లేదు. కారణం ఆ స్థితిలో ఉన్నవారికి అపారమైన 'శక్తి' వస్తుంది.

ఈ శరీరాన్ని నడిపించే 'శక్తిని' అంతులేకుండా పొందుతూ ఉంటారు. 'ధ్యానం' చేస్తే అంత "శక్తి" వస్తుంది అన్న సంగతి మనకు తెలియదు. అందుకే, భోజనం చేస్తారు కానీ! అందులో లభించేది చాలా తక్కువ శక్తి.

గుర్తుంచుకోండి "ధ్యానం చేయడం అంటే సారాన్ని తీసుకోవడం". భోజనం చేయడం అంటే? పిప్పిని వదిలి కొద్దిపాటి సారాన్ని గ్రహించడం. ఈ విషయం అర్థమైతే ' ధ్యానాన్ని' వదిలిపెట్టమన్నా..... వదిలిపెట్టరు.

'ధ్యానంలో' ఉండిపోయిన వారికి కాల కృత్యాలు లాంటివి అవసరం

లేవు. ఏ 'శక్తి' అయితే శరీరంలోని సుమారు 200 క్రియలు నడిపిస్తుందో, ఇంద్రియాలు పనిచేయడానికి ఉపయోగపడుతుందో, శరీరం పనిచేయడానికి ఉపయోగపడుతుందో....ఆ శక్తినే మనం ' ధ్యానం' ద్వారా తీసుకుంటాము.

"ముమ్మడివరం బాలయోగిని" తీసుకున్నట్లయితే 40 ఏళ్ల నుంచి కూర్చున్న వారు లేవకుండా కూర్చున్నాడు. ఆయన్ని చూస్తే రోజు నాలుగు పూటలు తిన్నవాడిగా పుష్టిగా ఉంటాడు.

"హంసకి మానస సరోవరం" దొరికినట్టు వీరికి ' భగవంతుడు' దొరికాడు. ఇంకేం కావాలి? ఇంకో 100 జన్మలెత్తినా చివరికి పొందవలసింది ఆ భగవంతుడినే. "మానస సరోవరం" దొరికేంతవరకు 'హంస' వెతుకుతూనే ఉంటుంది. అది దొరికాక దానికి ఇంకేం అవసరం లేదు. 'భగవంతుడు' దొరికితే మానవుడికి ఇంకేం కావాలి? "ఆ భగవంతుడే ఆత్మ"

"ఆత్మ"ను పొందడానికే మనం చేసే ఈ "శ్వాస మీద ధ్యాస ధ్యానం". 'ధ్యానం' రోగాల కోసం కాదు, లాభాల కోసం కాదు, అనుభవాల కోసం కాదు.' ధ్యానం' ఎందుకంటే? 'ధ్యానం' చేసేది భగవంతుడిని పొందడానికి. ఇక వారికి ' జన్మలు' ఉండవు, ' దుఃఖం' ఉండదు, ఏమీ ఉండదు. ధ్యానం చేస్తే అలా చేయాలి.


'హంస' మానస సరోవరంతో ఎలా 'తృప్తి' పడుతుందో... మానవుడు 'ధ్యానం'లో ఆ "ఆనందానుభూతి" పొందిన తర్వాత అంత 'తృప్తి' పడతాడు.

"సమాధి స్థితికి" వెళ్లేంతవరకు జన్మలు తీసుకుంటూనే ఉంటారు. కాస్త 'శ్రద్ధ' పెడితే చాలు ఎన్నో జన్మలు అవసరం లేదు, ఇదే ఆఖరి జన్మ అవుతుంది. "సుఖాలు, సంతోషాలు" ఎందుకు? ఆ "ఆనందం" ముందు ఇవన్నీ బలాదూర్... 'సంపదలు, డబ్బు' అన్నీ ఉంటాయా అంటే? అన్నీ వదిలేయాల్సిందే! కానీ వాటిని చూసి మురిసిపోతారు... వాటికోసం 'తప్పులు' చేస్తారు, జీవితమంతా వాటి కోసమే వెచ్చిస్తారు...... కానీ ఆ ' భగవంతుడి' కోసం కొంచెం కూడా వెచ్చించరు.

అందుచేత 'ఆత్మ' సాక్షాత్కారం పొందితే ఇంకేమీ అవసరం లేదు.

# తేటవర్తి వీరరాఘవరావు గారి రచనలు

1) జీవితశాస్త్రం (మొదటి భాగం) - రూ.130/-
2) జీవితశాస్త్రం (రెండవ భాగం) - రూ.130/-
3) జీవిత సత్యాలు - రూ.130/-
4) సత్యమార్గం - రూ.160/-
5) ధ్యాన శక్తి - రూ.130/-
6) ధ్యాన శాస్త్రం - రూ.130/-
7) ఆత్మ శాస్త్రం - రూ.120/-
8) భగవద్గీతా సారం - శ్రీ కృష్ణ సందేశం -రూ.160/-
9) మరణించకముందే మరణించాలి - రూ.130/-
10) జీవిత సూక్ష్మాలు - రూ.130/-
11) "గైడింగ్" ధ్యానం ఎందుకు కాదు? - రూ.120/-
12) గీతాసందేశం - రూ.120/-
13) ఉపమాన ధ్యాన సందేశాలు -రూ.110/-
14) భగవంతుడంటే - రూ.100/-
15) తెలుసుకోండి - రూ.100/-
16) మెహర్‌బాబా సందేశాలు - రూ.100/-
17) మరణం తర్వాత జరిగేది తెలుసుకుంటే కలిగే లాభాలు- రూ.100/-
18) పత్రీజీ చెప్పిన శ్వాస మీద ధ్యాసా? పత్రీజీ చేయించిన మ్యూజిక్ మీద ధ్యాసా? ఏది సరైన ధ్యానం? - రూ.100/-
19) కోరికల వల్ల నష్టాలు - రూ.100/-
20) శంకరాచార్యుల వారి జ్ఞాన సందేశాలు- రూ.100
21) కఠోపనిషత్తు - రూ.90/-
22) ఉపమాన జ్ఞాన సందేశాలు-రూ.90/-
23) కర్మ సిద్ధాంతం - రూ.80/-
24) ధ్యానమంటే ? - రూ.80/-
25) త్రివిధాలు - రూ.80/-
26) ఉత్తమ పురుషుడు - రూ.80/-
27) శాస్త్రాల అర్థం- అంతరార్థం - రూ.70/-
28) ఆత్మజ్ఞానం ఎందుకు? - రూ.70/-
29) జ్ఞాన జ్యోతి - రూ.70/-
30) జ్ఞాన కుసుమాలు - రూ.70/-
31) మరణం తర్వాత కూడా వచ్చేవి - రూ.70/-
32) షిరిడీ సాయి సందేశాలు - రూ.70/-
33) విద్యార్థుల వికాసానికి ధ్యాన విద్య- రూ.70/-
34) బుద్ధుని సందేశాలు - రూ.70/-
35) భూతదయే దైవత్వం - రూ.70/-
36) ఆత్మహంతకులంటే ఎవరు?- రూ.70/-
37) స్త్రీ జన్మల్లో నేర్చుకునేవి, పురుష జన్మల్లో నేర్చుకునేవి - రూ.70/-
38) ధర్మ సూక్ష్మాలు - రూ.70/-
39) ఆశ్చర్యకరమైన విషయాలు -రూ.70/-
40) మానవునిలోని చెడు -రూ.70/-
41) మేడమ్ బ్లావెట్స్కీ సందేశాలు -రూ.70/-
42) దుఃఖ నివారణామార్గం - రూ.60/-
43) బ్రహ్మజ్ఞానం - రూ.60/-
44) ధ్యానం (పత్రీజీ) - రూ.60/-
45) ధ్యానం వల్లనే జ్ఞానం - రూ.60/-
46) అతీంద్రియ శక్తులు - రూ.60/-
47) ఆలోచించండి - రూ.60/-
48) నిర్వాణ మార్గం - రూ.60/-
49) ధ్యానులకు సూచనలు - రూ.60/-
50) యోగీశ్వరుల సందేశాలు - రూ.60/-
51) మాస్టర్‌గా ఎదగాలంటే? -రూ.50/-
52) భగవంతుని ఇష్టులవ్వాలంటే-రూ.50/-
53) సంకల్పమంటే? - రూ.50/-
54) ఈ జీవితం ఎందుకు? - రూ.50/-
55) ఆశ్చర్యం... ఆశ్చర్యం - రూ.50/-
56) మూడురకాల భవిష్యత్తులు -రూ.50/-
57) అరిహంత్ - రూ.50/-
58) మూడురకాల జీవితాలు -రూ.40/-
59) ఆర్థిక పరిస్థితి పెంచుకోవాలంటే- రూ.40/-
60) ఛాంపియన్ అవ్వాలంటే? -రూ.40/-
61) బ్రహ్మం అంటే? -రూ.40/-
62) శంకరాచార్యుల వారి జాగ్రత పంచకం-రూ.40/-
63) శంకరాచార్యుల వారి నిర్వాణ షట్కం -రూ.40/-
64) మహాత్ముల సందేశాలు - రూ.40/-
65) సత్యం - రూ.40/-
66) చక్రాలు - రూ.40/-
67) గురువును గుర్తించడం ఎలా? - రూ.40/-
68) భాగవత సన్నివేశాల అంతరార్థం- రూ.40/-
69) మౌన ధ్యానం - రూ.40/-
70) మనం ఇహలోకవాసులమా? పరలోకవాసులమా? -రూ.20/-
71) శాకాహారమే మానవాహారం - రూ.15/-
72) అహింస మరియు శాఖాహారం- రూ.15/-



ప్రపంచంలో మనం చూసినట్లయితే 99 శాతం మంది దైవాన్ని నమ్ముతున్నారు. నమ్మకాల్లో తేడా ఉండొచ్చు, దైవం యొక్క పేర్లు, ఆరాధించే విధానంలో తేడా ఉండొచ్చు కానీ అంతా దైవాన్ని నమ్మేవారే. దేవుడంటే ఇష్టమేనా అని అడిగితే అంతా వెంటనే ఇష్టమే అని చెప్తారు.

దేవుడంటే ఇష్టం అని అంటున్నావు అసలు దేవుడికి నువ్వు ఇష్టుడు అయ్యావా? అంటే చెప్పలేరు. మరి అది ఎవరు చెప్పగలరు అంటే ఆ దేవుడే చెప్పగలడు.

ఏం చేస్తే దేవుడికి ఇష్టులమవుతాము? దేవుడికి ఇష్టులు అయితే ఎలాంటి లాభాలు పొందుతాం? ఎటువంటి వాడిని ఆయన ఇష్టపడతాడు? ఎంతమంది ఉన్నా ఎవరు భగవంతునికి ఇష్టులు అంటే! జ్ఞానం పొందడానికి ప్రయత్నించేవారే భగవంతునికి ఇష్టులు, వారే గొప్పవారు కూడా. కోరికలతో ధ్యానం చేసేవాడు భగవంతునికి ఇష్టుడు కాలేడు. ధ్యానులు అయినా సరే! ఆశించి ధ్యానం చేసేవారు భగవంతునికి ఇష్టులు కాలేరు.

భగవంతుడు ఎవరు అంటే? ఆత్మ. ఆత్మ ఎక్కడ ఉంటుంది అంటే? సమస్త జీవుల్లోనూ ఉంది. మానవ శరీరంలో కూడా ఉంది. శరీరంలో ఉన్నటువంటి భగవంతుడిని ఎలా ఆశ్రయించాలి అంటే? ఆయన్ని ఆశ్రయించే మార్గమే ఇప్పుడు మనమందరం చేస్తున్న "శ్వాస మీద ధ్యాస" ధ్యానం. ఇది తప్ప ఇంక ఏ రకమైన ధ్యానం వల్ల భగవంతుడిని ఆశ్రయించలేరు.

- బ్రహ్మర్షి తటవర్తి వీరరాఘవరావు

రూ.50/-